తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
12 అక్టోబరు, 2025




# జేబుకు బలం
# జిఎస్టీ ఫలం



# విజయ్ దేవరకొండ, రష్మికల నిశ్చితార్థం

టాలీవుడ్‌లో పాపులర్ జంటగా పేరొందిన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఎట్టకేలకు తమ ప్రేమకథను అధికారికం చేసినట్టుగా తెలుస్తోంది. కొన్నేళ్లుగా ఇద్దరు ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారని పలు వార్తలు వచ్చినా, ఈ జంట ప్రతిసారి హాస్యంగా తప్పించుకునేవారు. అయితే తాజా సమాచారం ప్రకారం, ఈ జంట హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ వేదికపై కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో గత వారం నిశ్చితార్థం చేసుకున్నారని, వచ్చే యేడాది ఫిబ్రవరిలో వివాహ బంధంలోకి అడుగు పెట్టబోతున్నారని సన్నిహితులు తెలిపారు.

రష్మిక మందన్న 'చలో' సినిమాతో తెలుగు తెరకు పరిచయమై తొలి చిత్రంతోనే హిట్ అందుకుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండతో 'గీత గోవిందం' సినిమాలో నటించి బ్లాక్‌బస్టర్ జంటగా నిలిచింది. ఈ హిట్ జంట మరోసారి 'డియర్ కామ్రేడ్'లోనూ కలిసి నటించి ఫ్యాన్స్ హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించింది.

తెరపై హిట్ పెయిర్‌గా నిలిచిన వీరిద్దరూ, నిజ జీవితంలోనూ జంటగా మారడం సినీ ప్రేమికులకు డబుల్ హ్యాపీగా మారింది. విజయ్-రష్మిక రిలేషన్‌పై గతంలో వచ్చిన రూమర్స్‌పై ఈ జంట ఎప్పుడూ "మేం మంచి స్నేహితులం" అని సమాధానం ఇచ్చేవారు. కానీ కలిసి టూర్స్‌కి వెళ్లడం, పార్టీల్లో పాల్గొనడం.. లాంటివి ఆ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చాయి. ఇప్పుడు నిశ్చితార్థ వార్తలు బయటకు రావడంతో అభిమానులకు ఇది నిజమైన సర్‌ప్రైజ్‌గా మారింది. త్వరలో జరగబోయే వివాహం టాలీవుడ్‌లో అత్యంత చర్చనీయాంశంగా నిలుస్తుందని, అభిమానులు సోషల్ మీడియాలో ఇప్పటికే శుభాకాంక్షలతో ముంచెత్తుతున్నారని తెలుస్తోంది.

తారాతీరం



# కరణ్ జోహార్ జోడీగా శ్రీలీల

టాలీవుడ్‌లో తన అందం, అభినయంతో పాటు చలాకీతనంతో యువతను ఆకట్టుకుంటున్న శ్రీలీల, ఇప్పుడు బాలీవుడ్ వైపు తన అడుగులు వేగవంతం చేస్తోంది. ఇప్పటికే ఒక హిందీ సినిమాలో నటిస్తున్న శ్రీలీల.. ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌లో నటించే అవకాశం దక్కించుకున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ నిర్మిస్తున్న 'దోస్తానా 2' సినిమాలో శ్రీలీలను హీరోయిన్‌గా దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ చిత్రంలో నేషనల్ అవార్డు గ్రహీత విక్రాంత్ మాస్సే హీరోగా నటిస్తున్నారు. వాస్తవానికి, ఈ పాత్ర కోసం ముందుగా జాన్వీ కపూర్‌ను ఎంపిక చేసినప్పటికీ, కొన్ని కారణాల వల్ల ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు. దీంతో ఆ అద్భుత అవకాశం శ్రీలీలను వరించినట్టు బాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం దీనిపై నిర్మాత కరణ్ జోహార్ తుది చర్చలు జరుపుతున్నారని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే శ్రీలీల, బాలీవుడ్ యంగ్ స్టార్ కార్తిక్ ఆర్యన్ సరసన ఒక సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా సెట్స్‌పై ఉండగానే ఇప్పుడు రెండో అవకాశం కూడా ఆమె తలుపు తట్టడంతో, బాలీవుడ్‌లో శ్రీలీల కెరీర్ దూసుకుపోవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకదాని తర్వాత ఒకటిగా రెండు పెద్ద ప్రాజెక్టులలో అవకాశాలు రావడంతో, శ్రీలీల బాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడం ఖాయమని సినీ వర్గాల టాక్.

ఆదివారం వార్త

12 అక్టోబరు, 2025

## మంచి ముత్యాలు

- ఉపదేశం కన్నా ఉదాహరణ గొప్ప ప్రతిభాశాలిగా పని చేస్తుంది. – శామ్యూల్ జాన్సన్
- చిన్న పిల్లల్ని గురించి తెలుసుకుంటే అన్నీ తెలుసుకున్నట్లే. – కోకో ఛానల్

## కదంబం

'సంఘీ'భావం....5
ఖైదీల్లో గోల్డ్‌మెడలిస్టులు

కవర్ స్టోరీ..6
జేబుకు బలం
జిఎస్టీ ఫలం

ఈ వారం కవిత్వం...12
అమ్మతనం

కథ..20
బ్లాక్ టీ

అరుదైన ఆలయాలు... 18

చారిత్రక వారసత్వానికి చిహ్నం...... 28

ఇంకా...
మొగ్గ
వారఫలం
వగైరా.. వగైరా..

# సమాచారం

## పర్యాటక ఆకర్షణగా..

గైజౌ ప్రావిన్స్‌లోని హువాజియాంగ్ గ్రాండ్ కెన్యన్ మీదుగా నిర్మించిన ఈ భారీ వంతెనను ఈ మధ్యనే అధికారికంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ బ్రిడ్జి నిర్మాణంతో రెండు ప్రాంతాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గిపోయింది.

లోతైన లోయకు 625 మీటర్ల (2,050 అడుగులు) ఎత్తులో నిర్మించిన ఈ వంతెన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైనదిగా గుర్తింపు పొందింది. బీపన్ నదిపై నిర్మించిన ఈ బ్రిడ్జి పొడవు సుమారు 2,900 మీటర్లు. మూడేళ్లకు పైగా శ్రమించి, ఇంజినీరింగ్ అద్భుతంగా నిలిచే ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు.

ఈ వంతెనను ప్రారంభించడానికి ముందు దాని పటిష్టతను క్షుణ్ణంగా పరీక్షించారు. గత నెలలో 96 భారీ ట్రక్కులను ఏకకాలంలో వంతెనపైకి పంపి లోడ్ టెస్టింగ్ నిర్వహించారు. 400 సెన్సార్ల ద్వారా బ్రిడ్జి సామర్థ్యాన్ని, భద్రతను అంచనా వేసి, సురక్షితమని నిర్ధారించుకున్న తర్వాతే రాకపోకలకు అనుమతించారు.

ఈ వంతెన ప్రపంచంలో అత్యంత ఎత్తైనది కావడమే కాకుండా, పర్వత ప్రాంతంలో నిర్మించిన అతిపెద్ద స్పాన్ వంతెనగా కూడా మరో రికార్డును నెలకొల్పింది. కేవలం రవాణా కోసమే కాకుండా, ఈ వంతెనను ఒక పర్యాటక ఆకర్షణగా కూడా తీర్చిదిద్దారు.

పర్యాటకుల కోసం ప్రత్యేకంగా 207 మీటర్ల ఎత్తైన సైట్ సీయింగ్ ఎలివేటర్, స్కై కేఫ్‌లు, వ్యూయింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి లోయ అందాలను వీక్షించడం ఓ అద్భుతమైన అనుభూతినిస్తుందని అధికారులు తెలిపారు. ప్రపంచంలో అత్యంత ఎత్తైన పది వంతెనల్లో ఎనిమిది చైనాలోనే ఉండటం గమనార్హం.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com




## ఇంటిపని

భార్య వంటింట్లో గిన్నెలు కడగమన్నదని వీరాస్వామి లాయరు సలహా తీసుకోవడానికి లాయర్ దగ్గరికి వెళ్లాడు.

"లాయరుగారూ, లాయరు గారూ..!" అని పిలుస్తూ హడావుడిగా వెళ్లాడు.

ఇంతలో "ఎవరూ?" అంటూ లాయరు గారు పరుగు పరుగున పనిమధ్యలో వచ్చాడు.

వీరాస్వామి వచ్చిన విషయం తెలుసుకుని "నేను అదే పని చేస్తుంటే మధ్యలో వచ్చి నా పని చెడగొట్టావయ్యా, నా టైమంతా వృథా అయిపోయింది. పని తొందరగా అవలేదని మా ఆవిడ నన్ను కోప్పడుతుంది" అన్నాడు.

మారు మాట్లాడకుండా వీరాస్వామి ఇంటి దగ్గర అంట్లు తోమడానికి తక్షణమే బయలుదేరాడు.

– వైదా ఈశ్వరరావు, విశాఖ

## వారఫలం

విజ్జి: "ఏమండీ! ఈ వారం నేను అమ్మ దగ్గర వెళ్లి ఉంటాను".

నాని: "అలాగే వెళ్లు. అయినా తెలుసు.. నువ్వు అడుగుతావని".

విజ్జి: "ఔనా? ఎలా తెలుసు మీకు?"

నాని: "ఈ వారం నాకు సంతోషం, శాంతి బాగా ఉంటాయని వారఫలాల్లో రాసారు".

## పేషెంట్ మారిపోయాడు

ఎస్.ఐ: "ఏమిటి డాక్టర్? ఇంజక్షన్ మారడం వలన పేషెంట్లు చనిపోయాడా?"

డాక్టర్: పొరపాటున కూడా ఇంజక్షన్ మారదు. పేషెంట్ మారిపోయాడు".

## నరకంలో..

అనిల్: "వివాహాలు స్వర్గంలో జరుగుతాయని అంటుంటారు.. ఎందుకు?"

నాని: "వివాహం మాత్రమే స్వర్గంలో జరుగుతుంది. మిగతా జీవితమంతా నరకంలోనే".

## ఇల్లు లేదుగా..

డాక్టర్: "మిమ్మల్ని డిశ్చార్జ్ చేసారు. మీరు ఇంటికి వెళ్లొచ్చు".

ప్రదీప్: "ఇంకా ఎక్కడి ఇల్లు? అది అమ్మి మీ బిల్లు కట్టాను, కనుక ఇక్కడే ఉంటాను".

## మాట్లాడాలని

లిఖిత: "నేను మాట్లాడుతున్నప్పుడు ఆరు సార్లు ఆవలించారు. అంత సుత్తిగా ఉందా?"

రావు: "అయ్యో! అది ఆవలింత కాదు మాట్లాడాలని నోరు విప్పాను".

# నవ్వుల్... రువ్వుల్...

## తిరిగివ్వాలిగా..!

అనిల్: "ప్రదీప్! నాకు వెయ్యి రూపాయలు కావాలి, ఇవ్వు".

నాని: "నీ దగ్గర క్రెడిట్ కార్డు ఉందిగా, వాడుకో"

అనిల్: "ఓ..! అదా? కానీ తిరిగి కట్టాలిగా!"

– మాధవన్

## లాభం లేదు

పక్కింటాయన: అప్పులు ఎక్కువ అయితే చాలా మంది ఊరు వదిలి పారిపోతారు కదా.. నువ్వు ఆత్మహత్య చేసుకోవడానికి ఎందుకు ప్రయత్నించావు?

బాధితుడు: నాకు అప్పులు ఇచ్చిన వాళ్ళు మంత్రగాళ్ల సహాయంతో నేను ఎక్కడ ఉన్నానో చూస్తారు.. కాబట్టి పారిపోయినా ప్రయోజనం లేదు.

## ఇంటిపని

ప్రేమికులు: పార్కులో గుబురుగా ఉన్న పొదలు తొలగిస్తున్నారు ఎందుకు? పాములు వస్తాయనా?



పార్క్ యజమాని: పాముల కంటే ప్రమాదకరమైన మీలాంటివాళ్లు వస్తున్నారు కాబట్టి.

– ఎస్ కె.యాకూబ్ పాషా

## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు... వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080

sunmagvaartha@gmail.com

# 'సంఘీ' భావం



# ఖైదీల్లో గోల్డ్‌మెడలిస్ట్‌లు

తెలిసో తెలియకో, ఆవేశంలోనో, ఆగ్రహంతోనో కొందరు నేరాలకు పాల్పడుతుంటారు. చట్టం ముందు వీరు దోషులుగా పరిగణించిన తరువాత చేసిన తప్పుకు జైళ్లలో శిక్షను అనుభవిస్తుంటారు. అయితే తప్పు జరిగిన తరువాత ప్రాయశ్చితం అనేది ముఖ్యం. తాము చేసింది తప్పని, దానివల్ల ఒక కుటుంబం కాని, వ్యవస్థ కాని నష్టపోయిందన్న ఆవేదన కొందరు ఖైదీల్లో స్పష్టంగా కనిపిస్తుంది. చేసిన నేరాన్ని బట్టి దోషులకు కొన్ని నెలలు లేదా కొన్ని సంవత్సరాలు శిక్ష పడుతుంది. కొందరికి యావజ్జీవ శిక్షలు కూడా పడతాయి. వీరు సంవత్సరాల తరబడి జైలు గోడల మధ్య దుర్భర జీవితాన్ని కొనసాగిస్తారు. కొందరు ఖైదీలు చేసిన తప్పుకు బాధపడుతూనే జైలు జీవితంలో వ్యక్తిగత మార్పులను కోరుకుంటారు. కొందరు వివిధ పనుల్లో నైపుణ్యతను పొందగా మరికొందరు విద్య పట్ల ఆసక్తి చూపిస్తారు. చాలా మంది ఖైదీలు పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదివినవారు ఉన్నారు. వీరికి ఉన్నత విద్యలు అభ్యసించాలన్న కోరిక ఉంటుంది. దీనికి దూరవిద్య ద్వారా వారి కోరికలను సాఫల్యం చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఆసక్తి కలిగిన ఖైదీలు తిరిగి చదువుకోడానికి విద్యాదానం పేరుతో జైలు అధికారులు చేసిన ప్రతిపాదనలకు అనుగుణంగా డా॥ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఖైదీలకు ఉన్నత విద్యను అభ్యసించడానికి మార్గం చూపించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని జైళ్లలో ఉన్న వారికి విద్యను అభ్యసించే అవకాశాన్ని కల్పించారు. హైదరాబాద్‌లోని చర్లపల్లి, చంచల్‌గూడతో పాటు కడప, రాజమండ్రి తదితర జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న వారికి ఉన్నత విద్యాభ్యాసం చేయడానికి ప్రోత్సహించారు. గత విద్యాసంవత్సరం 2023-24లో ఏకంగా 230 మంది ఖైదీలు డిగ్రీలు, పోస్టు గ్రాడ్యుయేషన్లు, డిప్లొమా కోర్సులు విజయవంతంగా పూర్తి చేసి పట్టాలను అందుకున్నారు. పదవ తరగతి చదివిన వారు చాలా మంది డిగ్రీలను పూర్తి చేయగలిగారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ స్వయంగా ఈ పట్టాలను వారికి అందించారు. ఆ సమయంలో ఖైదీలు ఆనందంతో ఉప్పొంగిపోవడం కనిపించింది. వీరిలో ఇద్దరు ఖైదీలు ఏకంగా బంగారు పతకాలను సాధించారు. పట్టాలు పొందిన వారిలో చర్లపల్లి, చంచల్‌గూడ కేంద్ర కారాగారాల్లోని 13 మంది ఖైదీలు ఉన్నారు. జిల్లా జైళ్లలో ఖైదీలుగా శిక్షను అనుభవిస్తున్న 25 మంది పురుషులు, ముగ్గురు మహిళలు పోస్టు గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేశారు. తిరుపతి జిల్లాకు చెందిన యుగంధర్ యావజ్జీవ శిక్షను అనుభవిస్తున్నాడు. కడప కేంద్ర కారాగారంలో శిక్షను అనుభవిస్తున్న ఇతను యూనివర్సిటీ నుంచి మొత్తం నాలుగు డిగ్రీలు, మూడు పోస్టు గ్రాడ్యుయేషన్‌లను పూర్తి చేశాడు. బిఏ, ఎంఏ సోషియాలజీలో ఏకంగా రెండు బంగారు పతకాలను సాధించాడు. ఇక గుంటూరు జిల్లా చింతలపూడికి చెందిన రాజకుమారి బిఏలో అత్యధిక మార్కులను సాధించి బంగారు పతకాన్ని పొందింది. ఈ విధంగా ఎందరో ఖైదీలు తమ ముళ్లబాటను పూలబాటగా మార్చుకోవడానికి మానసికంగా సిద్ధమయ్యారు. పోస్టు గ్రాడ్యుయేషన్ పట్టాలు పొందినవారిలో కొందరు దాదాపుగా శిక్షను పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉన్నారు. జైలు జీవితాన్ని ప్రారంభించిన సమయంలో ఉన్నటువంటి ప్రవర్తనను పూర్తిగా మార్చుకున్నారు. తాము చేసిన తప్పుకు పూర్తి స్థాయిలో పశ్చాత్తాపం చెందుతున్నారని జైలు అధికారులు పేర్కొంటున్నారు. జైళ్లను సంస్కరణాలయాలుగా మార్చి, కరుడుగట్టిన నేరస్తులను మానవతావాదులుగా, సమాజానికి ఉపయోగపడే వారిగా తీర్చిదిద్దడంలో జైళ్లు చాలావరకు సఫలీకృతం అవుతున్నాయన దానికి డిగ్రీ, పిజీ పరీక్షల్లో వచ్చిన మార్పులు స్పష్టం చేస్తున్నాయి.

జరిగిన తప్పును తలచుకుని వేదన చెందడం కంటే జైల్లోనే తమ జీవితాన్ని మార్పు చేసుకోవాలన్న దిశగా ఖైదీలు ఆలోచిస్తున్నారు. దీనికి జైలు అధికారులు సహకరించి వారిలో మార్పుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఖైదీల్లో వస్తున్న మార్పును చూసి గవర్నర్ సైతం ఆనందాన్ని వ్యక్తం చేశారు.

శిక్ష పూర్తి చేసుకుని బయటకు వచ్చే ఖైదీలు తమ పాత జీవితాన్ని పూర్తిగా మరిచి తాము పొందిన విద్యార్హత సర్టిఫికెట్లతో మంచి జీవనాన్ని గడపాలని జైలు అధికారులు వారికి సూచిస్తున్నారు. మరికొందరు వృత్తి నైపుణ్యాన్ని కూడా పొందుతున్నారు. జైలు నుంచి వచ్చిన తరువాత చిన్న చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా తమ భవిష్యత్తు జీవనాన్ని ఆనందమయంగా గడిపేందుకు ఖైదీలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

# జేబుకు బలం జీఎస్టీ ఫలం

డి.జె. మోహన రావు

మన దేశంలో పన్నుల విధానం ఎప్పుడూ ఒక ప్రధాన చర్చనీయాంశంగానే ఉంటుంది, ఎందుకంటే ప్రభుత్వానికి ఆదాయం రావాలంటే పన్నులే ముఖ్యమైన మార్గం. అయితే, ఆ పన్నులను ఎలా వసూలు చేయాలనేది చాలా కీలకం. పన్నుల భారం ఒకరిపైనే ఎక్కువగా పడితే, వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తుతాయి. ఫలితంగా, వ్యాపారాలు సరిగా సాగక, పెట్టుబడులు తగ్గిపోతాయి.

ముఖ్యంగా పరోక్ష పన్నులు ప్రజలకు చాలా క్లిష్టంగా ఉంటాయి. ఎందుకంటే, ఈ పన్నులను ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చెల్లించరు. బదులుగా, మనం ఏదైనా వస్తువు కొన్నప్పుడు లేదా ఏదైనా సేవ తీసుకున్నప్పుడు దాని ధరలోనే ఈ పన్నులు కలిసి ఉంటాయి. ఉదా: ఒక బిస్కెట్ ప్యాకెట్ కొన్నప్పుడు దాని ధరలోనే జీఎస్టీ ఉంటుంది. ఇలాంటి పన్నులే మన ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతాయి.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయంతో భారత పరోక్ష పన్నుల విధానంలో ఒక కొత్త శకం మొదలైంది. దీనిని 'జీఎస్టీ 2.0' అని పిలుస్తున్నారు. ఇది 2025 సెప్టెంబర్ 22 నుండి అమలులోకి వచ్చింది. 2017లో వచ్చిన తొలి జీఎస్టీ తర్వాత ఇంత పెద్ద పన్నుల మార్పు ఇదే. ఈ కొత్త విధానం ఒకే పన్ను, ఒకే మార్కెట్ లక్ష్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. అలాగే, పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేస్తుంది. ఈ విధానంలో ఇదివరకు ఉన్న నాలుగు పన్ను రేట్లైన 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతంలను తొలగించి, వాటి స్థానంలో నిత్యావసర వస్తువులపై 5 శాతం, ప్రామాణిక వస్తువులు, సేవలపై 18 శాతం పన్నులుంటాయి. అయితే, సిన్ లేదా విలాస వస్తువులపై ఏకంగా 40 శాతం పన్ను విధించారు. 'సిన్' వస్తువులు అంటే పొగాకు, జూదం, బెట్టింగ్, శీతల పానీయాలు, అధిక కొవ్వు, చక్కెర ఉన్న ఆహార పదార్థాలు వంటివి. అదేవిధంగా, పెద్ద కార్లు, ఖరీదైన మోటార్ సైకిళ్లు, వ్యక్తిగత విమానాలు వంటి విలాస వస్తువులపై కూడా ఇదే పన్ను వర్తిస్తుంది. ఈ మార్పుల వల్ల పన్ను రేట్లు హేతుబద్ధంగా మారి, పన్నుల విధానంలో గందరగోళం తగ్గుతుంది. ఇది ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చి, వినియోగాన్ని పెంచుతుందని, ద్రవ్యోల్బణాన్ని తగ్గిస్తుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.




## ఒకే పన్ను విధానం

జీఎస్టీని తీసుకురావాలనే ఆలోచన 2000వ సంవత్సరం చివరిలో మొదలైంది. జీఎస్టీ రాకముందు మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా రకాల పన్నులను వసూలు చేసేవి. దీనివల్ల పన్నుల వ్యవస్థ చాలా గందరగోళంగా ఉండేది. ఈ గందరగోళాన్ని తొలగించడానికి జీఎస్టీని ప్రవేశపెట్టారు. ఈ విధానం దాదాపు 17 రకాల కేంద్ర, రాష్ట్ర పన్నులను, ఇంకా 13 రకాల సెస్సులను కలిపి ఒకే పన్నుగా మార్చింది. ఈ పన్నులలో వ్యాట్, సేవా పన్ను, ఎక్సైజ్ డ్యూటీ, వినోదపు పన్ను, ఆక్ట్రాయ్ వంటివి ఉన్నాయి. అయితే, జీఎస్టీని అమలు చేయడం అంత సులభం కాదు. కేంద్రం, రాష్ట్రాల మధ్య ఆదాయ పంపకాలపై చాలా విభేదాలు వచ్చాయి. రాజకీయంగా, చట్టపరంగా ఎన్నో అడ్డంకులను దాటుకుంటూ, సంవత్సరాల తరబడి చర్చలు జరిపిన తర్వాత, చివరకు 2017 జూలై 1న అర్ధరాత్రి నుంచి జీఎస్టీ అధికారికంగా అమలులోకి వచ్చింది. జీఎస్టీ అమలులోకి రావడానికి భారతదేశ రాజ్యాంగానికి 101వ సవరణ చేశారు. ఈ సవరణ ద్వారా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు వస్తువులు, సేవలపై పన్నులు విధించే అధికారం వచ్చింది. దీనివల్ల దేశమంతా ఒకే రకమైన పన్ను వ్యవస్థను తీసుకురావడం సాధ్యమైంది.

జీఎస్టీ అనేది వస్తువులు, సేవల సరఫరాపై విధించే పన్ను. ఇదివరకు ఉన్న పన్నుల విధానంలో వస్తువులను ఎక్కడ తయారు చేస్తే అక్కడ పన్ను వసూలు చేసేవారు. కానీ, జీఎస్టీలో ఆ వస్తువులను ఎక్కడ అమ్ముతారో/ఎక్కడ వినియోగిస్తారో, ఆ ప్రాంతానికి పన్ను ఆదాయం వెళ్తుంది. ఉదా: ఒక వస్తువును తెలంగాణలో తయారు చేసి ఆంధ్రప్రదేశ్‌లో అమ్మితే ఆ పన్ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వెళ్తుంది. దీనివల్ల పన్ను భారం పూర్తిగా వస్తువును కొనుగోలు చేసే చివరి వినియోగదారుడిపై పడుతుంది.

## ఒకే దేశం.. ఒకే పన్ను

జీఎస్టీని ప్రవేశపెట్టడం వెనుక ప్రధాన లక్ష్యం దేశంలో ఉన్న అన్ని రకాల పన్నులను కలిపి ఒకే పన్ను విధానంగా మార్చడం. దీనివల్ల భారతదేశం ఒకే జాతీయ మార్కెట్‌గా మారుతుంది.

## 2017 జీఎస్టీ విధానం నిర్మాణం లోపాలు

ప్రారంభంలో 2017లో వచ్చిన జీఎస్టీ విధానంలో చాలా లోపాలు ఉన్నాయి. ముఖ్యంగా దీనిలోని పన్ను రేట్లు చాలా క్లిష్టంగా ఉండేవి. ఈ విధానంలో 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం అనే నాలుగు వేర్వేరు పన్ను రేట్లు ఉండేవి. ఈ పన్ను రేట్లను నిత్యావసర వస్తువుల నుండి విలాస వస్తువుల వరకు విభజించారు. అయితే, వస్తువులను ఏ రేటు కిందకు తీసుకు రావాలనేది చాలా గందరగోళంగా మారింది. దీనివల్ల చాలా ఇబ్బందులు వచ్చాయి.

## నిర్మాణ లోపాలు బహుళ పన్ను రేట్లు, అసంపూర్ణ అమలు

2017లో వచ్చిన జీఎస్టీలో ప్రధానమైన లోపం దాని నిర్మాణంలో ఉంది. ఇందులో ఉన్న బహుళ పన్ను రేట్ల విధానం (5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం) పన్ను వ్యవస్థను సరళీకృతం చేయాలనే అసలు లక్ష్యానికి పూర్తిగా విరుద్ధంగా ఉంది. ఈ నాలుగు రేట్ల వల్ల వ్యాపారులు, ముఖ్యంగా చిన్న, మధ్య తరహా వ్యాపారులకు తమ ఉత్పత్తులను ఏ రేటు కింద వర్గీకరించాలో తెలియక చాలా ఇబ్బందులు పడ్డారు. అన్ని పరోక్ష పన్నులను ఒకే విధానం కిందకు తీసుకురావాలని అనుకున్నప్పటికీ, పెట్రోలియం ఉత్పత్తులు, మద్యం, విద్యుత్ వంటి ఎక్కువ ఆదాయం వచ్చే ముఖ్యమైన వస్తువులను జీఎస్టీ పరిధి నుంచి మినహాయించారు. ఈ వస్తువులపై ఇప్పటికీ పాత పన్నుల విధానమే కొనసాగుతోంది. దీనివల్ల, జీఎస్టీ తొలగించాలనుకున్న పన్నుల క్యాస్కేడింగ్ ప్రభావం ఈ వస్తువులపై అలాగే ఉండిపోయింది.

## అమలులో ఎదురైన సమస్యలు

2017లో జీఎస్టీని ఆదరాబాదరాగా అమలు చేయడం వల్ల చాలా సమస్యలు తలెత్తాయి. జీఎస్టీకి సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్ అయిన జీఎస్టీ నెట్‌వర్క్ సరిగ్గా పనిచేయలేదు. దీనివల్ల పన్ను చెల్లింపుదారులు పన్ను రిటర్నులు దాఖలు చేయడంలో చాలా ఇబ్బందులు పడ్డారు. దీని ఫలితంగా చాలా మంది గడువు తేదీలను కూడా దాటిపోయారు.

కొవిడ్ 19 మహమ్మారి తర్వాత కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన జీఎస్టీ పరిహారం ఇవ్వడంలో జాప్యం జరిగింది. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. ఇది కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య నమ్మకాన్ని దెబ్బతీసింది. అలాగే, జీఎస్టీ కౌన్సిల్ సమావేశాల్లో కూడా ఈ విషయంపై చాలా వాదోపవాదాలు జరిగాయి. ఇంకో సమస్య ఏంటంటే, జీఎస్టీ వివాదాలను పరిష్కరించడానికి ఏర్పాటు చేయాల్సిన జీఎస్టీ అప్పీలేట్ ట్రైబ్యునల్ స్థాపనలో చాలా ఆలస్యం జరిగింది. దీనివల్ల వ్యాపారాలకు సంబంధించిన పన్ను వివాదాలు పరిష్కారం కాకుండా పేరుకుపోయాయి. ఈ అనిశ్చితి వ్యాపార వర్గాల్లో గందరగోళాన్ని సృష్టించింది. దీంతో వారు ఆర్థికంగా, చట్టపరంగా ఇబ్బందులు పడ్డారు.




## జీఎస్టీ 2.0 కి నాంది

పాత జీఎస్టీలో ఉన్న సమస్యలన్నిటినీ పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం కొత్తగా 'జీఎస్టీ 2.0'ని తీసుకొచ్చింది. ఈ కొత్త విధానం పాత వ్యవస్థలోని ప్రధాన లోపాలను సరిదిద్దడానికి, పన్నుల వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మార్చడానికి రూపొందించబడింది.

## సామాన్యుడికి లాభాలు

జీఎస్టీ 2.0 వల్ల సామాన్య ప్రజలకు అనేక లాభాలు ఉన్నాయి. ఈ కొత్త పన్నుల విధానం వారి జేబులకు ఊరటనిస్తుంది. అలాగే వారి జీవన ప్రమాణాలను కూడా మెరుగుపరుస్తుంది. ఈ సంస్కరణల వల్ల వినియోగదారులకు నేరుగా ఆర్థికంగా లబ్ధి చేకూరుతుంది. పన్ను రేట్లు తగ్గడం వల్ల నిత్యావసరాలు, గృహోపకరణాలు గణనీయంగా చౌకగా లభిస్తాయి. దీనివల్ల సామాన్య ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ప్రజలు ఎక్కువ వస్తువులు కొనుగోలు చేస్తే, అది మార్కెట్‌లో డిమాండ్‌ను పెంచుతుంది. ఇది చివరికి దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. జీఎస్టీ 2.0లో వచ్చిన మార్పుల వల్ల సబ్బులు, షాంపూలు, టూత్‌పేస్టులు, హెయిర్ ఆయిల్స్ వంటి మనం రోజూ వాడే వస్తువులు చాలా చౌకగా మారతాయి. ఎందుకంటే, వీటిపై ఇదివరకు ఉన్న 12-18 శాతం పన్నును ఇప్పుడు 5 శాతానికి తగ్గించారు.

## ఆటోమొబైల్, తయారీ రంగం

ఆటోమొబైల్ రంగంలో జీఎస్టీ 2.0 సంస్కరణలు ఒక స్పష్టమైన విధానాన్ని చూపుతున్నాయి. లగ్జరీ కార్లు, దిగుమతి చేసుకున్న వాహనాలపై పన్ను భారం పెంచుతూనే సామాన్యులు వాడే వాహనాలను, దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం దీని ప్రధాన లక్ష్యం.

చిన్న కార్లు, 350 సీసీ వరకు ఉన్న టూ వీలర్లు, వాణిజ్య వాహనాలపై పన్నును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. దీనివల్ల మధ్య తరగతి కుటుంబాలకు, మొదటిసారిగా వాహనం కొనేవారికి ఈ వాహనాలు అందుబాటు ధరల్లో లభిస్తాయి. ఈ నిర్ణయం వల్ల మార్కెట్‌లో డిమాండ్ బాగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. దసరా పండుగ సీజన్‌కు ఈ మార్పులు అమలులోకి రావడంతో వాహన తయారీ సంస్థలు, ఎలక్ట్రానిక్ కంపెనీలు అమ్మకాలకు సిద్ధమయ్యాయి.

అదే సమయంలో 1500 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం లేదా 4000 ఎంఎం పొడవు ఉన్న పెద్ద లగ్జరీ వాహనాలపై కొత్తగా 40 శాతం పన్ను విధించారు. ఈ పెంపు వల్ల ఈ వాహనాలు మరింత ఖరీదైనవిగా మారతాయి.

## సేవా రంగం జీఎస్టీ 2.0తో కొత్త ఊపు

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో సేవా రంగం చాలా ముఖ్యమైనది. జీఎస్టీ 2.0 ఈ రంగానికి కొత్త శక్తిని ఇవ్వనుంది. పాత జీఎస్టీలో ఉన్న సమస్యలను సరిచేసి, పన్నుల విధానాన్ని మరింత సులభతరం చేయడం వల్ల సేవా రంగం బాగా అభివృద్ధి చెందుతుంది. పాత విధానంలో కొన్ని సేవలపై 18 శాతం పన్ను ఉండేది. కానీ కొత్త జీఎస్టీలో పన్ను రేట్లు తగ్గించడం వల్ల కొన్ని సేవల ధరలు తగ్గుతాయి. ఉదాహరణకు హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణా వంటి సేవలు ఇప్పుడు తక్కువ ధరకే లభిస్తాయి. దీనివల్ల ప్రజలు ఈ సేవలను ఎక్కువగా ఉపయోగిస్తారు, తద్వారా సేవా రంగంలో వ్యాపారాల ఆదాయం పెరుగుతుంది. ఈ మార్పులు మార్కెట్‌లో ఆరోగ్యకరమైన పోటీని కూడా పెంచుతాయి. చివరికి వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి.



## ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్

జీఎస్టీ 2.0 లో వచ్చిన ఒక ముఖ్యమైన మార్పు.. ఆర్థిక సేవలు, బీమా రంగానికి సంబంధించింది. కొత్త విధానం ప్రకారం వ్యక్తిగత జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంలపై ఇంతకు ముందు ఉన్న 18 శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించారు. ఈ మార్పు ప్రజలకు పెద్ద ఊరట. ఎందుకంటే, ఇప్పుడు వారు తక్కువ ఖర్చుతో బీమా పాలసీలు తీసుకోవచ్చు. ఇది ప్రజల కొనుగోలు శక్తిని పెంచుతుంది. అలాగే, ఎక్కువ మంది బీమా పాలసీలు తీసుకునేలా ప్రోత్సహిస్తుంది. దీనివల్ల ఆర్థికంగా ప్రజలకు మరింత భద్రత లభిస్తుంది.

## నిర్మాణం, రియల్ ఎస్టేట్ జీఎస్టీ సంస్కరణల ప్రభావం

జీఎస్టీ సంస్కరణల వల్ల నిర్మాణం, రియల్ ఎస్టేట్ రంగాలు గణనీయమైన ప్రోత్సాహాన్ని అందుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ రంగాలు ఒక శక్తివంతమైన ఆర్థిక ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి. సిమెంట్ ధరపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం ఈ పరిశ్రమ చాలా కాలంగా కోరుకుంటున్న సంస్కరణ. ఈ పన్ను తగ్గింపు వల్ల ప్రతి బస్తా ధర రూ.25 నుంచి రూ.30 వరకు తగ్గుతుందని అంచనా. అదనంగా, ఇసుక, సున్నపు ఇటుకలు, పాలరాయి, గ్రానైట్ వంటి ఇతర ముఖ్య నిర్మాణ వస్తువులపై పన్నులు 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. ఈ చర్య వల్ల నిర్మాణ ఖర్చులు మరింత తగ్గుతాయి. నిర్మాణ ఖర్చులు తగ్గడం వల్ల ప్రభుత్వ మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యాలకు నేరుగా మద్దతు లభిస్తుంది. అలాగే, సిమెంట్ మార్కెట్‌లో గణనీయమైన వాటాను కలిగి ఉన్న గృహ నిర్మాణం మరింత అందుబాటులోకి వస్తుంది. ఈ చర్య వల్ల డిమాండ్ పెరుగుతుందని, కార్మిక ఆధారిత నిర్మాణ రంగంలో కొత్త ఉద్యోగాలు ఏర్పడతాయని, తద్వారా ఆర్థిక వ్యవస్థపై విస్తృతమైన సానుకూల ప్రభావం పడుతుందని భావిస్తున్నారు. ఈ చర్య వల్ల సిమెంట్ కంపెనీలు తాత్కాలికంగా లాభాలను తగ్గించుకోవచ్చు. అయితే, జేఎం ఫైనాన్షియల్ నివేదిక సూచించిన ప్రకారం, ఈ చర్య వల్ల పరిశ్రమ అధిక అమ్మకాల ద్వారా మధ్య నుండి దీర్ఘకాలికంగా నికర ఆదాయాలు, లాభాలను పెంచుకోవడానికి అనుకూలమైన స్థితిలో ఉంటుంది. బలమైన గ్రామీణ నెట్‌వర్క్‌లు ఉన్న కంపెనీలు దీనివల్ల ప్రధానంగా లబ్ధి పొందుతాయి.

## ఎలక్ట్రానిక్స్ వస్తువులపై ప్రభావం

వస్తు సేవల పన్ను ఎలక్ట్రానిక్స్ ధరలను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. జీఎస్టీ 2.0లో ఎలక్ట్రానిక్స్ పై పన్ను రేట్లు తగ్గించబడ్డాయి. దీంతో చాలా వస్తువులు తక్కువ పన్ను పరిధిలోకి వచ్చాయి. 32 అంగుళాల కంటే పెద్ద టీవీలు, ఏసీలు, డిష్‌వాషర్లపై గతంలో ఉన్న 28 శాతం పన్ను 18 శాతానికి తగ్గింది. ఈ మార్పు టీవీల అమ్మకాలను పెంచింది. అలాగే చాలా కాలంగా ఏసీలపై అధిక పన్ను గురించి ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు ఈ రేట్ల తగ్గింపుతో పరిష్కారమయ్యాయి. ముఖ్యంగా నగరాల్లో, మరింత సరసమైన ధరలో ఏసీల అమ్మకాలు పెరిగాయి. డిష్‌వాషర్లు కూడా పట్టణవాసులకు దగ్గరవుతాయి. ఈ పన్ను తగ్గింపు గృహ పనులను ఆధునీకరించడానికి, చేతి పని భారాన్ని తగ్గించడానికి ఒక అవకాశం. తగ్గిన పన్ను వల్ల ఎక్కువ మంది ప్రజలు ప్రాథమిక గృహోపకరణాలను కొనుగోలు చేయగలుగుతారు. పట్టణీకరణ, పెరుగుతున్న ప్రజల ఆదాయంతో ఈ పన్ను రేట్ల మార్పు వలన ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ బలోపేతం అవుతుంది.

## వస్త్ర పరిశ్రమ

జీఎస్టీ 2.0లో వచ్చిన మార్పుల వల్ల వస్త్ర పరిశ్రమకు పెద్ద ఊరట లభించింది. ఇప్పుడు, మానవ నిర్మిత ఫైబర్స్, నూలుపై జీఎస్టీని ఒకే విధంగా 5 శాతానికి తగ్గించారు. ఈ నిర్ణయం 'విలోమ సుంకం నిర్మాణం' అనే సమస్యను పరిష్కరించింది. ఇంతకుముందు, వస్తువులను తయారు చేయడానికి ఉపయోగించే ముడి సరుకులపై పన్ను ఎక్కువగా ఉండేది.

## వ్యవసాయ రంగంపై ప్రభావం

ట్రాక్టర్, హార్వెస్టర్, రోటేవేటర్ వంటి వివిధ రకాల వ్యవసాయ పరికరాలపై జీఎస్టీని 18 శాతం నుండి 5 శాతానికి తగ్గించారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా రైతులకు ఇది ఎంతో ప్రయోజనం. ఈ రేట్ల తగ్గింపుతో వ్యవసాయ ఖర్చు తగ్గుతుంది.

## ఎరువులు.. ఇంధన ఆధారిత పరికరాలు

ఇంధనంతో నడిచే పరికరాలపై జీఎస్టీని 12 శాతం నుండి 5 శాతానికి తగ్గించడం రైతులకు మరో ప్రయోజనం. రైతులను ఇంధన ప్రదాతలుగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నందున, పరిశోధన ఆధారిత పరికరాలు కూడా చౌకగా లభిస్తాయి. బిందు సేద్యం వంటి వాటిపై కూడా జీఎస్టీ తగ్గించారు. అవి చౌకగా అందుబాటులో ఉంటాయి. వాటిని వాడటం వల్ల నీరు ఆదా అవుతుంది, పంట దిగుబడి పెరుగుతుంది, రైతులకు లాభాలు వస్తాయి.

## పాడి పరిశ్రమకు ఊతం

పాడి రంగంలో, పాలు, జున్నుపై ఇప్పుడు జీఎస్టీ లేదు. ఇది సామాన్యులకు మాత్రమే కాదు, రైతులు, పశువుల పెంపకందారులు, పాల ఉత్పత్తిదారులకు కూడా మేలు చేస్తుంది. దీనివల్ల డిమాండ్ పెరిగి పాలు కొనుగోలు చేసి ఉత్పత్తులు తయారు చేసేవారికి లాభం కలుగుతుంది. పాల ఉత్పత్తిదారులు, పశువుల పెంపకందారులు అయిన రైతులు కూడా నేరుగా ప్రయోజనం పొందుతారు. వెన్న, నెయ్యిపై జీఎస్టీ తగ్గించారు. కాబట్టి ఈ స్వదేశీ ఉత్పత్తుల అమ్మకాలు పెరుగుతాయి. పాల డబ్బాలపై కూడా జీఎస్టీ తగ్గించారు. ఈ మార్పుల వల్ల పాడి రంగం అభివృద్ధి చెందితే, రైతులు, పశువుల పెంపకందారులు కూడా నేరుగా అభివృద్ధి చెందుతారు.

## పండ్లు, కూరగాయల అమ్మకంపై ప్రభావం

పండ్లు, కూరగాయలకు విలువను జోడించడం, వాటిని ప్రాసెస్ చేయడం ఇప్పుడు చాలా అవసరం. ఈ ప్రాసెసింగ్ ద్వారా తయారు చేసిన, నిల్వ ఉంచిన కూరగాయలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్‌పై కూడా జీఎస్టీ తగ్గించారు. దీనివల్ల ఆ ప్రయోజనం నేరుగా రైతులకు అందుతుంది. కోల్డ్ స్టోరేజ్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు కూడా దీనివల్ల ప్రయోజనం పొందుతాయి.

## చేపల పెంపకం సులువు

దేశంలోని చాలా ప్రాంతాలలో చేపల పెంపకం జరుగుతుంది. సముద్రాలలోనే కాదు, ఇప్పుడు పొలాలలో చెరువులు నిర్మించడం ద్వారా కూడా చేపల పెంపకం పెద్ద ఎత్తున జరుగుతోంది. తయారు చేసిన లేదా నిల్వ ఉంచిన చేపలపై పన్ను రేటు తగ్గించబడింది. దీనివల్ల దేశవ్యాప్తంగా చేపల పెంపకంలో నిమగ్నమైన రైతులు కూడా లాభం పొందుతారు. అదేవిధంగా, సహజ తేనెపై జీఎస్టీ తగ్గడం వల్ల తేనె ఉత్పత్తి చేసే రైతులు కూడా నేరుగా ప్రయోజనం పొందుతారు.

## ఆర్థిక ప్రోత్సాహం

పన్నులు తగ్గడం వల్ల ప్రజలు ఎక్కువ వస్తువులు కొనుగోలు చేస్తారు. దీనివల్ల మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుంది. ఆర్థిక నిపుణులు దీనిని 'ఆర్థిక ఉద్దీపన' అని పిలుస్తున్నారు. అంటే ఆర్థిక వ్యవస్థకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్య అని అర్థం.

## సవాళ్లు పరిష్కారాలు

ఈ కొత్త విధానం కొన్ని ఆర్థిక, నిర్వహణ పరమైన సవాళ్లను కూడా తీసుకురావచ్చు. కేవలం పన్నులు తగ్గించడం వల్ల పెరిగే వినియోగం స్వల్పకాలికంగా మాత్రమే ఉపయోగపడవచ్చు. ఈ వినియోగం దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి అవసరమైన పెట్టుబడులు, ఉత్పత్తి పెరుగుదలతో కలిసి సాగకపోతే ఈ ప్రభావం తాత్కాలికమేనని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనిని పరిష్కరించాలంటే ప్రభుత్వం కేవలం పన్నుల తగ్గింపుతోనే ఆగకుండా, వ్యాపారాలకు పెట్టుబడులు పెట్టడానికి, ఉత్పాదకత పెంచడానికి కూడా ప్రోత్సాహం ఇవ్వాలి. అప్పుడే ఈ సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలు శాశ్వతంగా ఉంటాయి.

జీఎస్టీ 2.0 వల్ల సామాన్య ప్రజలకు మేలు జరుగుతున్నప్పటికీ, దీనిని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలకు కొన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది.



ప్రధానమైన సమస్య ఏమిటంటే పన్ను రేట్లు తగ్గడం వల్ల రాష్ట్రాల ఆదాయం తగ్గుతుందేమోనని అవి భయపడుతున్నాయి.

## చిన్న, మధ్య తరహా వ్యాపారులకు కష్టాలు, పరిష్కారాలు

కొత్త జీఎస్టీ 2.0 విధానం వల్ల చిన్న, మధ్య తరహా వ్యాపారులు కొన్ని కష్టాలు ఎదుర్కొనే అవకాశం ఉంది. కొత్త పన్ను రేట్లు, వాటికి సంబంధించిన లెక్కలు, కొత్త సాఫ్ట్‌వేర్ పద్ధతులకు అలవాటు పడటం వారికి పెద్ద తలనొప్పిగా మారవచ్చు. ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్న వ్యాపారులకు ఇది మరింత కష్టంగా ఉంటుంది. ఈ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవాలి.

వ్యాపారులకు కొత్త జీఎస్టీ విధానంపై అవగాహన కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలి. చిన్న వ్యాపారులు సులభంగా ఉపయోగించుకోగలిగే సాఫ్ట్‌వేర్లను ప్రభుత్వం అందించాలి. జీఎస్టీ నెట్‌వర్క్ ద్వారా పన్నులు కట్టే విధానాన్ని మరింత సులభతరం చేయాలి. మొదట్లో కొత్త విధానానికి అలవాటు పడటానికి చిన్న వ్యాపారులకు పన్నులు కట్టడానికి అదనపు సమయం ఇస్తే వారికి చాలా ఊరట దొరుకుతుంది. ఈ చర్యల ద్వారా ప్రభుత్వం చిన్న వ్యాపారులకు అండగా నిలిచి, కొత్త జీఎస్టీ విధానాన్ని విజయవంతం చేయవచ్చు.




జీఎస్టీ 2.0 అమలులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం, ఆర్థిక నిపుణులు కొన్ని మార్గాలను సూచిస్తున్నారు. పన్ను రేట్లను తగ్గించడం వల్ల వస్తువుల ధరలు తగ్గి, ప్రజలు ఎక్కువ వస్తువులను కొనుగోలు చేస్తారు. దీనివల్ల మార్కెట్‌లో వినియోగం పెరుగుతుందని, తద్వారా పన్ను ఆదాయం పెరిగి, మొదట సంభవించే ఆదాయ నష్టాన్ని భర్తీ చేస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది. రెండవది సిగార్లు, ఖరీదైన కార్లు వంటి విలాసవంతమైన, హానికరమైన వస్తువులపై కొత్తగా 40 శాతం పన్ను స్లాబ్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ఆదాయ నష్టాన్ని పూడ్చుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కొత్త జీఎస్టీ రేట్ల వల్ల వ్యాపారాలు ఎదుర్కొనే సమస్యలను తగ్గించడానికి ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. వ్యాపారులు తమ పాత స్టాక్‌పై ఉన్న ఎంఆర్‌పీ (గరిష్ఠ చిల్లర ధర)ను మార్చుకోవడానికి 2025 డిసెంబర్ 31 వరకు అనుమతి ఇచ్చింది. దీనివల్ల వ్యాపారులకు, ముఖ్యంగా చిన్న వ్యాపారులకు చాలా ఊరట లభిస్తుంది. అలాగే, పన్నుల వివాదాలను త్వరగా పరిష్కరించడానికి జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయడం చాలా అవసరం.

కొత్త జీఎస్టీ రేట్ల ప్రభావం అన్ని రాష్ట్రాలపై ఒకేలా ఉండదు. పన్ను ఆదాయంపై ఎక్కువగా ఆధారపడిన పంజాబ్, బీహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు, అలాగే అధిక వినియోగం ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాలు తీవ్రమైన ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. దీనివల్ల ఈ రాష్ట్రాలు తమ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు సమకూర్చడంలో ఇబ్బందులు పడవచ్చు. పన్ను తగ్గింపు వల్ల వచ్చే ప్రయోజనాలను వినియోగదారులకు పూర్తిగా అందేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. దీనికోసం మార్కెట్‌పై నిఘా పెంచాలి. ఆదాయ నష్టం గురించి ఆందోళన పడుతున్న రాష్ట్రాలకు ధైర్యం చెప్పడానికి, కేంద్ర ప్రభుత్వం ఒక స్పష్టమైన నష్టపరిహార పథకంను తీసుకురావాలి. అప్పుడే రాష్ట్రాలు ఆర్థికంగా సురక్షితంగా ఉంటాయి.

## భవిష్యత్తుపై కొత్త ఆశ

జీఎస్టీ 2.0 అనేది కేవలం పన్నుల రేట్లను మార్చడం మాత్రమే కాదు. ఇది భారత ఆర్థిక వ్యవస్థకు ఒక కొత్త దారి చూపిస్తుంది. ఈ విధానం వల్ల సామాన్య ప్రజల జేబులకు చాలా ఊరట లభిస్తుంది. పన్నులు తగ్గడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఇది దేశ ఆర్థిక వృద్ధికి చాలా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా తయారీ, వ్యవసాయ, ఆరోగ్య రంగాలకు ఈ మార్పులు పెద్దగా సహాయపడతాయని అంచనా. ఈ సంస్కరణలు విజయవంతం కావాలంటే మూడు విషయాలపై దృష్టి పెట్టాలి. అవి: ఒకటి: సామాన్య ప్రజలకు ప్రయోజనాలు పూర్తిగా అందేలా చూడాలి. రెండు: వ్యాపారాలకు ఎదురయ్యే సాంకేతిక, నిర్వహణ సమస్యలను పరిష్కరించాలి, మూడు: రాష్ట్రాలకు వచ్చే ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలి. ఈ వాస్తవ ప్రయోజనాలు అందరికీ చేరాలంటే, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యాపారాలు కలిసికట్టుగా పని చేయాలి. అప్పుడే ఈ జీఎస్టీ 2.0 సంస్కరణలు పూర్తిగా విజయవంతం అవుతాయి.

## జీఎస్టీ 2.0: ఆర్థిక వ్యవస్థకు కొత్త బలం

ఈ కొత్త పన్నుల విధానం మన దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రపంచంలోనే ఒక పెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడానికి సహాయపడుతుంది. ఈ కొత్త పద్ధతి వల్ల వచ్చే లాభాలను, దాని అమలు విధానాన్ని మీడియా, ప్రభుత్వ సమావేశాలు, వెబ్‌సైట్ల ద్వారా ప్రజలకు, వ్యాపారులకు చాలా స్పష్టంగా చెప్పాలి.

**ఆర్థిక లక్ష్యాల వైపు ఒక అడుగు:** జీఎస్టీ 2.0 లాంటి సంస్కరణలు భారతదేశం 30 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ కలను సాకారం చేయడానికి ఒక ముఖ్యమైన అడుగు. ఈ చర్యల ద్వారా భారతదేశం ఆర్థికంగా మరింత బలోపేతమవుతుంది. ఇది మన దేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం అనే లక్ష్యం వైపు ముందుకు నడిపిస్తుంది.

**జీఎస్టీ 2.0 ఒక కొత్త ఆశ:** జీఎస్టీ 2.0 కేవలం పన్ను వ్యవస్థను మెరుగుపరచడం మాత్రమే కాదు. ఇది మన దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలంగా మార్చడానికి ఒక ముఖ్యమైన అడుగు. పన్ను రేట్లను తగ్గించడం ద్వారా ప్రజలు ఎక్కువ ఖర్చు చేస్తారు. అలాగే, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఈ విధానం సామాన్య ప్రజల జీవితాల్లో ఒక పెద్ద మార్పు తీసుకు వస్తుంది. మొదట్లో కొన్ని కష్టాలు ఎదురైనప్పటికీ, భవిష్యత్తులో ఈ విధానం మన దేశం వేగంగా ఎదగడానికి, అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి దారి చూపిస్తుంది. ఈ కొత్త జీఎస్టీ విధానం మన దేశ ఆర్థిక భవిష్యత్తుకు ఒక కొత్త మార్గం,

## మనందరికీ ఒక కొత్త ఆశ

మొత్తానికి జీఎస్టీ అనేది ఒక గొప్ప మార్పు. మొదట్లో దీనికి చాలా సమస్యలు ఎదురయ్యాయి. కానీ కాలక్రమేణా ఇది మెరుగుపడుతూ వస్తోంది. భవిష్యత్తులో సరళత (సులభమైన పన్ను విధానం), పారదర్శకత (అన్ని వివరాలు స్పష్టంగా ఉండటం), రాష్ట్రాల విశ్వాసం అనే ఈ మూడు అంశాలు బలోపేతమైతేనే జీఎస్టీ మన దేశానికి ఒక నిజమైన, సమగ్ర పన్ను సంస్కరణగా నిలుస్తుంది. అలా జరిగితేనే, భారతదేశం 'ఒకే దేశం-ఒకే మార్కెట్' అనే కలను నిజం చేసుకోగలుగుతుంది.

# అమ్మతనం



జనన మరణాల మధ్య
ముందు మరణాన్ని జయిస్తుంది.
తనలాంటి జీవికి జీవం పోసి
జీవితం కోసం యుద్ధం చేస్తుంది.
నెల నెలకు తనను తాను చూసుకొని
మురిసిపోతుంది
తొమ్మిది నెలల పాటు గర్భంలో భద్రంగా దాచి
పుట్టబోయే బిడ్డకోసం
పురిటినొప్పుల బాధను దిగమింగి
నవజాత శిశువును చూసి నొప్పిని మర్చిపోతుంది.
ఉమ్మనీరు మింగి బిడ్డకు హాని కలిగినప్పుడు
కొన్నిసార్లు ఇలా.. చాలాసార్లు
దేవుడెట్ల రాస్తే అట్లనుకొని ఏడుస్తుంటది
అమ్మ ఎప్పుడైనా తన బాధల్ని
దిగమింగుతుంటది
మూర్ఛపోయి మరణంతో
పోరాడుతుంటది
పచ్చి బాలెంతతనమున
మాగిముద్ద వాసన
కాన్పు కావడమంటే మరో
జన్మ ఎత్తినట్లు
పేగుబంధంతో పసిబిడ్డ
బయటికి వచ్చినప్పుడు
మత్తుకు మరణించి జన్మిస్తుంది
బిడ్డ పుట్టినప్పుడే
తాను మళ్లీ పుడుతుంది
పుట్టిన బిడ్డను ముద్దాడి మురిసిపోతుంది
అమ్మతనం పొంది ఆనందపడుతుంది

ఈ వారం కవిత్వం

– ఎజ్జు మల్లయ్య

# మనుగడ సాగించాలంటే

నిన్న కురిసిన వానలో
గువ్వలు ఒక్కొక్కటిగా
ఎగిరి వస్తున్నాయి.
ఆకలి మంటల్ని చల్లార్చుకోవడానికి
నాలుగు గింజల కోసం
వెతుకుతూ
ఆకాశం అంచుల దాకా ప్రయాణిస్తూ
భూగోళాన్ని జల్లెడ పడుతున్నాయి.
హడలెత్తించే హోరుగాలిని
పరిగెత్తించే వడగండ్ల వాన దాడిని
తట్టుకుంటూ
అవిశ్రాంతంగా అన్వేషిస్తున్నాయి.
వానను సైతం లెక్కచేయని
వాటి సంకల్పబలం
ఎంత గొప్పదో కదా...!
మనుగడ సాగించాలంటే
ఏ జీవికైనా కష్టం తప్పదు మరి

– నెల్లుట్ల సునీత



# అంతేగా... మరి!?

పగటికి రేయి
రేయికి పగలు కాపలా
పిల్లలకు తల్లీ తండ్రీ కాపలా!
భార్యాభర్తలు
ఒకరికొకరు కాపలా!
దేశ రక్షణ కోసం
వీర జవానులు కాపలా!
జీవనాధారమైన నీటికి
ఆనకట్ట కాపలా!
పండిన పండలను
రక్షించుటకు కంచె కాపలా!
స్వర్గధామ శ్మశానానికి
కాటికాపరి కాపలా!
మంచి మనిషికి మనసు కాపలా!
ఆ.. మనసుకు సృష్టికర్తే కాపలా!
అంతేగా.. మరి!

– డా॥ రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీ

# రెండో బాల్యం

ఒకప్పుడు నా చేతిని పట్టుకుని
బుడిబుడి నడకలు నేర్చుకున్న నీవు
ఇప్పుడు వణికే నా చేతులకు
ఆసరా ఇస్తావనుకున్నాను!
నా గుండెలపై ఆడిన
నీ చిన్ని పాదాలు
ఈ తడబడే బతుకు పయనంలో
తోడై నిలుస్తాయనుకున్నాను!
నా ఒడిలో ఆదమరచి నిద్రపోయిన
నీ బాల్యం నా రెండో బాల్యాన్ని
ఆనందమయం చేస్తుందనుకున్నాను!
కానీ..
తలుపు దగ్గర నిశ్శబ్దమే మిగిలింది.
బెల్లు మోగదు, అడుగుల శబ్దం
వినిపించదు!
ఒక ఫోన్ కాల్ కోసం
ఒక ప్రేమపూరిత మాట కోసం
నా హృదయం ఎదురు చూస్తూనే
ఉంది!
ఈ ఇంట్లో మిగిలింది
ఒంటరితనపు నిశ్శబ్దమే.
నా ఊపిరిలో మాత్రం
ఇప్పటికీ నిండిపోయాయి
నీ జ్ఞాపకాల నీడలే!

– డాక్టర్ మామిడాల శైలజ

# కల.. కథ

రాత్రంతా చినుకుల్లా
ఆలోచనలు. తెల్లవారి
పొర్లే భయాన్ని
చూస్తుంటే
ఎండిన మనసులో
మొలక లేనట్లే.
మబ్బులు పట్టిన
నిరాశకి
లోతట్టు మునిగి
ఇప్పుడు
ప్రతి పగటిది ఈతే
ఏ కల
ఏ కథ ఒడ్డుకు చేరేనో?
ఏ కథ ఏ కలపై
తేలేనో?

– శ్రీ సాహితి

సింగిల్ పేజీ కథ

# నీలం రంగు చీర



శ్యామల గ్రామీణాభివృద్ధి శాఖలో చిరు ఉద్యోగి. ఆ ఊరికి కొత్తగా బదిలీ అయ్యింది. ఆ ఊరు పల్లెకు ఎక్కువ, పట్నానికి తక్కువ అన్నట్టు ఉంటుంది. ఆమె భర్త పక్కనే ఉన్న పట్టణంలో మున్సిపల్ ఆఫీసులో హోదా కలిగిన ఉద్యోగి. భుజానికున్న హ్యాండ్ బ్యాగుతో బట్టల దుకాణం కోసం వెతుకుతూ నడిచింది శ్యామల.

హ్యాండ్ బ్యాగ్‌లో రెండు ఐదు వందల నోట్లు, మరి కాస్త పైచిల్లర. వాటికి తోడు ఒక సెల్ ఫోన్, చిన్న టిఫిన్ క్యారియర్. వెదుకుతున్న కళ్లకు ఒక బట్టల దుకాణం కనబడింది. మరీ చిన్నదీ కాదు, పెద్దదీ కాదు.

"మీరు పంచాయితీ ఆఫీసులో పనిచేస్తారు కదా మేడమ్!" శ్యామలను నవ్వుతూ పలకరించింది దుకాణ యజమానురాలు.

"అవును. మీకెలా తెలుసు?" అడిగింది శ్యామల.

"మా పాపకు క్యాస్ట్ సర్టిఫికెట్ అవసరమై గతవారం మీ ఆఫీసుకు వచ్చాను. అక్కడ మిమ్మల్ని చూశాను" చెప్పింది దుకాణదారురాలు.

చిన్న నవ్వుతో సరిపెట్టింది శ్యామల. బదులుగా నవ్వింది షాపామె.

"ఒక చీర కావాలి!" చుట్టూ చూస్తూ అడిగింది శ్యామల.

"లోపలికి రండి.." అంటూ శ్యామలను సాదరంగా ఆహ్వానించింది.

షాపులో ఉన్న మోడల్స్ అన్నింటినీ ఒక్కొక్కటి చూపిస్తోంది. చీరలతో పాటు వాటి ప్రైస్ టేగ్ కూడా గమనిస్తోంది శ్యామల. ఒక చీరెను చూడగానే శ్యామల కళ్లలో మెరిసిన మెరుపును షాపామె పసిగట్టింది.

శ్యామల ఆ చీరను చేతిలోకి తీసుకుంది. నెల రోజుల క్రితం తన పక్కింటి రజిని అదే చీరను ఒక పేరుమోసిన మాల్‌లో పదిహేను వందలకు కొనింది. అలాంటి చీర కొనుక్కోవాలని అప్పట్లో శ్యామల అనుకుంది. రజిని కొన్నది ఆకుపచ్చ రంగు చీర. ఇదేమో నీలం రంగు. శ్యామలకు తన తల్లి గుర్తుకొచ్చింది. నీలం రంగు బట్టలు తనకు బాగా నప్పుతాయని తల్లి ఎప్పుడూ అంటుండేది.

"ఈ చీర మీకు బాగుంటుంది మేడమ్" చెప్పింది షాపామె.

ఆమె మాటలతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది శ్యామల. అప్రయత్నంగా ప్రైస్ టేగ్ వైపు చూసింది. దానిపైన పదహారు వందలు అని ఉంది.

"పదమూడు వందలకు ఇవ్వగలను మేడమ్!" చనువును ప్రదర్శిస్తూ చెప్పింది షాపామె.

"వెయ్యి రూపాయలకు ఇవ్వగలరా?" కాస్త మొహమాటపడుతూనే అడిగింది శ్యామల.

"ఈ చీర పదిహేను వందల పైమాటే! మీరు మా పంచాయితీ ఆఫీసులో ఎంప్లాయి కదా అని.. నేను కొన్న రేటుకే మీకు ఇస్తున్నాను" కాస్త నచ్చచెబుతున్నట్టు చెప్పింది షాపామె.

శ్యామలకు ఇబ్బందిగా అనిపించింది.. "నా దగ్గర వెయ్యి రూపాయలే క్యాష్ ఉంది" మొహమాటపడుతూ చెప్పింది శ్యామల.

"క్యాష్ లేకున్నా పర్లేదు. ఫోన్ పే చేయండి" కాస్త ఉత్సాహాన్ని తెచ్చుకుంది షాపామె.

"నా దగ్గర ఫోన్ పే లాంటివి లేవు" నమ్ముతుందో లేదోనన్నట్టు చెప్పింది శ్యామల.

"కార్డయినా పర్లేదు మేడమ్!" చెప్పింది షాపామె.

శ్యామలకు ఏం చెప్పాలో అర్థం కాలేదు.. "ఉద్యోగం మాత్రమే తనదని జీతంపై పెత్తనమంతా తన భర్తదని; కష్టం మాత్రమే తనదనీ, కార్డు తన భర్త జేబులో ఉంటుందని; బాధ్యత మాత్రమే తనదని అధికారం ఆయనదని ఈమెకు ఎలా చెప్పాలి? ఈ కాలంలో కూడా, ఉద్యోగం చేస్తూ కూడా తన లాంటి ఆర్థిక స్వేచ్ఛ లేని స్త్రీలు ఈ సమాజంలో ఇంకా ఉన్నారని చెబితే ఈమె నమ్ముతుందా?"

శ్యామల మనసు నిండా ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి. ప్రతిరోజూ బస్సు చార్జీలకు కూడా తన భర్తను అడిగి డబ్బులు తీసుకోవాలని, తాను తిన్నదానికి, తాగినదానికి కూడా భర్తకు లెక్కలు చెప్పాల్సిన తన దయనీయ పరిస్థితికి తనలో తానే బాధపడింది శ్యామల.

"మేడమ్! మేడమ్!!" షాపామె పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది.

"చీరెను తీసుకెళ్లండి. మీ దగ్గర ఎప్పుడుంటే అప్పుడే పైచిల్లర ఇవ్వండి" నవ్వుతూ చీరను శ్యామల చేతిలో పెట్టింది.

- పేట యుగంధర్

# ఒంటరితనాన్ని ఓడించలేమా?

## ఒంటరితనం

ఒంటరితనం ఓ మానసిక భావోద్వేగ ప్రక్రియ. కొందరికి ఒంటరితనం లేదా ఏకాంతం ఓ అద్భుత అవకాశంగా నిలిస్తే మరికొందరిలో ఒంటరితనం ఓ అవాంఛనీయ అనారోగ్యకర సమస్యగా నిలుస్తున్నది. దాదాపు 50 శాతం జనాభా అంతర్ముఖులుగా ఒంటరితనాన్ని కోరుకుంటారు, అనారోగ్యాల బారిన పడతారు. కొందరికి ఒంటరితనం వరమయితే మరికొందరికి అది శాపంగా మారుతోంది. పరిమిత ఒంటరితనం శారీరక, మానసిక వికాసానికి, సానుకూల భావనలు జనించడానికి దోహదపడుతుంది. మితిమీరిన ఒంటరితనం ప్రమాదకరంగా మారి చివరికి ప్రాణాంతకం కూడా అవుతుంది. ఒంటరితనాన్ని మనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తే అది వ్యక్తి సంపూర్ణ శ్రేయస్సుకు ఉపకరిస్తుంది. ఒంటరితనానికి, ఏకాంతవాసానికి తేడా ఉన్నది. ఒంటరితనం అనేది ఒక భావోద్వేగ ప్రతికూల స్థితి. తాను ఇతరులతో కనెక్ట్ కావాలని కోరుకున్నప్పటికీ, వారి చుట్టు ఎవరూ లేరని భావించడాన్ని ఒంటరితనం అనవచ్చు.

## ఏకాంతం

ఏకాంతం అనేది ఒక వ్యక్తి కావాలని ఒంటరిగా ఉండడం, తమ చుట్టు పక్కలకు దూరంగా ఉంటూ ఆలోచనలు చేయడం అని అర్థం చేసుకోవాలి. ఏకాంతం అనేది ఒక ఆశావహ ప్రయోజనకర మానసిక స్థితి. ఒంటరితనం అనేది రుగ్మతగా మారితే అత్యంత ప్రమాదకరం అవుతుంది.

నిశ్శబ్ద రుగ్మతగా సమాజంలో వ్యాపిస్తున్న ఒంటరితనాన్ని ఒక దురాచారంగా లేదా ప్రతిష్టకు మచ్చగా నిలుస్తున్న వేళ దాని పట్ల అవగాహన కల్పించడం జరగాలి. దీర్ఘకాలం పాటు ఒంటరితనాన్ని అనుభవించిన వారిలో తీవ్రమైన అనారోగ్యాలు కలుగుతాయి. ఒంటరితనం హద్దులు మీరితే మతిమరుపు, హృదయనాళ అనారోగ్య సమస్యలు, స్ట్రోక్, నిరాశ, ఆందోళన, అకాల మరణాలు, అలసట, ఆత్మన్యూనత భావం, మానసిక ఒత్తిడి లాంటి అనారోగ్యాలు కలుగుతాయి.



ఒంటరితనం ఫలితంగా శారీరక, మానసిక, భావోద్వేగ, సామాజిక ప్రతికూలతలతో పాటు మానవ సంబంధాల సమస్యలు ఉత్పన్నం అవుతాయి.



కొందరు వ్యక్తుల్లో ఒంటరితనం లేదా ఏకాంత వాసం పలు ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. వ్యక్తిగత ఎదుగుదల, ఆత్మ విమర్శ చేసుకునే అవకాశం, గత లోపాలను సరిదిద్దుకునే ఆలోచనలు, రేపటి ప్రణాళికల రచనలు, తనలోని బలాలు/బలహీనతలను విశ్లేషించుకునే సదవకాశం, లక్ష్యాసాధన మార్గాల అన్వేషణలు, తన గురించి తాను ఆలోచించుకోవడం, సృజనశీల ఆలోచనలు, ఉత్పత్తికి ఊతం, ఏకాగ్రత పెరుగుదల, ఇతరుల ప్రభావాలకు దూరంగా స్వతంత్ర భావాలకు పట్టం కట్టడం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సమతుల సామాజిక సంబంధాల్లో ప్రగతి, ఆత్మ విమర్శకు అవకాశం, విశ్రాంతి దొరకడంతో రేపటికి శక్తిని కూడగట్టుకోవడం.. లాంటి అనేక ప్రయోజనాలు ఒంటరితనానికి లేదా ఏకాంత వాసానికి ఉంటాయి.

ఒంటరితనాన్ని ఓడించి చురుకుగా, సరదాగా సమాజంతో మమేకం అవుతూ జీవితాన్ని ఆస్వాదించడానికి కొని చిట్కాలను తెలుసుకోవాలి. మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులతో కలివిడిగా ఉండడం, చొరవ తీసుకొని ఇతరులతో మాట్లాడడం, మన అభిరుచులకు తగిన బంధువులు/మిత్రులతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ వేదికల్లో గడపడం, మనకు ఇష్టమైన పనులను చేసి ఆనందాన్ని పొందడం, మన భావాలను దగ్గరి వారితో పంచుకోవడం/పరిష్కార మార్గాలను తెలుసుకోవడం, ఒంటరిగా/ముభావంగా ఉండే వారికి దగ్గర కావడం లాంటి చర్యలు ఒంటరితన రుగ్మతను దూరం చేస్తాయి. ఒంటరితనాన్ని పరిమితం చేస్తూ, పౌర సమాజంతో దగ్గరవుతూ, సంతోష సాగరంలో మునుగుతూ, జీవితాన్ని సుసంపన్నం చేసుకుంటూ, ఎంపిక చేసుకున్న లక్ష్యాలను అధిగమిస్తూ, అందరి మన్ననలు పొందుతూ, చలాకీగా ప్రవర్తిస్తూ ఆయురారోగ్యాలతో జీవితాంతం ఆనందంగా ఉందాం, ఆనందాన్ని పంచుదాం.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

# కోరికలకు అంతు లేదు..

మనిషి జీవితం అనేది నిరంతర ప్రయాణం. ఆ ప్రయాణంలో ఒక ప్రధాన శక్తి కోరిక. ఒకప్పుడు కోరికలు చిన్నవి, సులువైనవి, జీవితాన్ని నడిపించేవి. పొట్ట నిండా అన్నం, గడప దగ్గర సేదదీరే గాలి, కుటుంబంతో పంచుకునే ఆనందం – ఇవే చాలనుకునే దశలు గడిచాయి. సంతృప్తి అనేది అప్పటి మనిషికి జీవన ధ్యేయంగా ఉండేది.

కానీ కాలం మారింది. విజ్ఞాన శాస్త్రం వేగంగా ఎదిగింది. కొత్త ఆవిష్కరణలు, ఆధునికత తెచ్చిన సౌకర్యాలు మనిషి మనసులో కొత్త ఆకాంక్షలకు మార్గం చూపాయి. క్షణక్షణం కొత్త కోరికలు ఉద్భవిస్తూ, సంతోషాన్ని మరింత దూరం నెట్టేస్తున్నాయి. ఇప్పుడు తృప్తి కాదు, ఎప్పటికీ పెరిగే ఆకలి మనిషిని వెంబడిస్తోంది.



ఆశ అనేది సహజం. అది లేకుంటే జీవితం ముందుకు సాగదు. కానీ ఆశ పెరిగిపోతూ అదుపు తప్పితే అది బంధనమవుతుంది. ఒకప్పుడు ఆశలు మనిషి దారికి వెలుగులా ఉండేవి. ఇప్పుడు ఆ ఆశలు అడుగడుగునా దారితప్పించే మాయదారులా మారాయి. పది వస్తువులు ఉండగానే పదకొండోది కావాలని తపన, సంపదతో పాటు ప్రతిష్ట కూడా కావాలని ఆరాటం, సాధారణ జీవనానికి బదులు విలాసాల కోసం పరుగులు – ఇవన్నీ మనిషి కోరికల విస్తరణకు అద్దం పడుతున్నాయి.

సమాజం కూడా కోరికల పెరుగుదలకు పునాది వేసింది. ఎవరికి ఏముంది అన్న దానిపై తులన, పోలిక, ప్రతిస్పర్ధ. ఒకరి దగ్గర కొత్త వస్తువు ఉంటే, మరొకరికి అది లేకపోవడం అసౌకర్యమైంది. ఈ 'సమాజపు దర్పణం' మనిషి అంతరంగాన్ని కదిలిస్తూ, మరింత అవసరాలు సృష్టిస్తోంది.

అయితే ప్రశ్న ఇదే.. ఆశను ఎక్కడ ఆపాలి? నియంత్రణ ఎక్కడ మొదలుపెట్టాలి? సమాధానం మనిషి లోపలే ఉంది. ఒకరికి కావలసినది మరొకరికి అవసరం కాదు. నిజమైన అవసరాలు, ఆవేశపు కోరికల మధ్య తేడా తెలుసుకోవడం జీవన శాంతికి మొదటి అడుగు. ఆశను దారి చూపడం, ఆ కోరికలు మానవతను దెబ్బతీయకుండా చూసుకోవడం– ఇదే నిజమైన నియంత్రణ.

మనిషి కోరికల యాత్ర అంతం కానిది. కానీ ఆ యాత్రలో సమతుల్యత అవసరం. లేకుంటే కోరికల సముద్రంలో మునిగిపోయే ప్రమాదం తప్పదు. కోరికలతో పాటు తృప్తిని కూడా పెంపొందించుకోవడం నేర్చుకుంటేనే జీవితం పరిపూర్ణమవుతుంది.

### కోరికల కాంతి–మనసు మలుపులు

మనిషి మనసు ఒక సముద్రం. ఆ సముద్రంలో అలలు ఎప్పటికీ ఆగవు. ఒక అల తగ్గకముందే మరొక అల పైకెక్కుతుంది. అలానే కోరికలు కూడా మనిషిని ఎప్పటికీ వదిలిపెట్టవు. ఒక కోరిక తీరగానే మరొక కోరిక ముందుకొచ్చే ఈ పరిణామం జీవన చక్రంలో సహజం. కానీ ఈ సహజత్వంలో అసహజం పెరుగుతున్న లోభం.

### పూర్వపు తృప్తి

పాత తరాల జీవనశైలి సాదా సీదా. పంట పండితే పొలంలో ఆనందం, ఇంట్లో వంటబట్టీ ఉంటే సంతోషం, ఒక చిన్న డ్రెస్ కొత్తగా కొన్నా ఉత్సవం. జీవితం అనేది అవసరాలను తీర్చుకోవడమేనని వారు నమ్మేవారు. "తక్కువలో సరిపెట్టుకోవడం" అన్న గుణం వారిని సుఖశాంతులకు దగ్గరగా ఉంచేది.

### నేటి పరిణామం

ఇప్పటి సమాజంలో జీవనవేగం పెరిగింది. శాస్త్రవిజ్ఞానం ఇచ్చిన యంత్రాలు, సాంకేతికత తెచ్చిన సౌకర్యాలు జీవన ప్రమాణాలను మార్చేశాయి. టెలివిజన్, ఇంటర్నెట్, ప్రకటనలు– ఇవన్నీ కలసి కొత్త కోరికలకు వేదిక అయ్యాయి. ఈ వేదికపై ప్రతి మనిషి నటుడు. నిన్నటి ఆనందం నేటి అసంతృప్తిగా మారిపోతోంది.

### సమాజపు ఒత్తిడి

ప్రతి ఒక్కరూ ఇతరులను చూసి తమ కోరికలను కొలుస్తున్నారు. "ఆ వ్యక్తికి ఉన్నది నాకు ఎందుకు లేదు?" అనే భావన అగ్నికి ఇంధనం పోసినట్టే. ఒకరి సొంత ఇల్లు, ఒకరి ఖరీదైన వాహనం, ఇంకొకరి పెద్ద ఉద్యోగం– ఇవన్నీ ఇతరుల కోరికలకు విత్తనాలు వేస్తున్నాయి. ఆ విత్తనాలు పెరిగి మనసులో తపనల అడవిగా మారుతున్నాయి.

కోరికల తీరని అలజడి మనిషిని శాంతి నుండి దూరం చేస్తోంది. కోరిక తీరకపోతే నిరాశ, తీరితే కొత్త తపన. ఈ వలయం అంతులేనిది. దీని వల్ల మనిషి మానసిక ఒత్తిడికి గురవుతాడు. సమాజంలో అనవసర పోటీలు, అసూయ, విభేదాలు పెరుగుతాయి. అంతేకాదు, కోరికలు అధికం అవడం వలన సహజ సంబంధాలు కూడా కృత్రిమమవుతాయి.

## నియంత్రణ అవసరం

కోరికను అదుపులో పెట్టడం అంటే దానిని చంపేయడం కాదు. దానిని దిశానిర్దేశం చేయడం. అవసరం, లాలసం మధ్య గీత గీయగలిగితేనే మనిషి సుఖశాంతులను పొందగలడు. ఆశ జీవనానికి శక్తి, కానీ అదుపు తప్పితే అదే బలహీనత. కాబట్టి ఆలోచనతో, వివేకంతో కోరికలను సంరక్షించడం మనిషి చేతిలోనే ఉంది.

చాలా తత్వవేత్తలు, కవులు, మునులు ఒకే మాట చెప్పారు.. కోరికలే దుఃఖానికి మూలం. వాటిని తగ్గించగలిగితేనే ఆత్మశాంతి వస్తుంది. భౌతిక సంపద కంటే అంతర్మథనంలో లభించే సంతృప్తి నిలకడైనది. తక్కువలో సంతోషం కనుగొనగలిగితేనే నిజమైన ధనం లభిస్తుంది.

## ప్రకృతి నుండి పాఠం

ప్రకృతిని గమనిస్తే కోరికల నియంత్రణకు గొప్ప పాఠం లభిస్తుంది. వృక్షం తనకు కావలసినంత నీటిని మాత్రమే తీసుకుంటుంది. జంతువు ఆకలిగా ఉన్నప్పుడు మాత్రమే ఆహారం కోసం వెతుకుతుంది. కానీ మనిషి మాత్రం అవసరాలకన్నా ఎక్కువ కోసం పరుగులు పెడతాడు. అందుకే ప్రకృతి సమతుల్యతలో ఉంటే, మనిషి మాత్రం అసమతుల్యంలో కూరుకుపోతున్నాడు.

**ఆలోచన:** మనిషి కోరికలు ఎప్పటికీ ఆగవు. అవి గమ్యం కాదు, ప్రయాణం. కానీ ఆ ప్రయాణంలో దారితప్పకూడదు. ఆశతో జీవించాలి, కానీ ఆ ఆశ మనల్ని ఆక్రమించకూడదు. సంతృప్తి అనే తలుపు ఎప్పుడూ మనసులో తెరిచి ఉంచాలి. ఎందుకంటే నిజమైన సంపద అనేది మనసుకు శాంతి, ఆత్మకు సంతోషం.



## ఆశల ఆకారం-కోరికల కదలికలు

మనిషి కోరికలు ఎందుకు పెరుగుతున్నాయి? అనే ప్రశ్నకు సమాధానం వెతకడం అనేది ఒక మానసిక యాత్ర. కోరికలు కేవలం భౌతిక అవసరాలకు పరిమితం కావు. అవి ఆత్మలోని లోటును నింపే ప్రయత్నం. లోటు లేకపోయినా, మరింత కావాలని అనిపించడం ఒక మానసిక వ్యాధిలా మారుతోంది.

## సామాజిక పరిణామం

మనిషి ఇప్పుడు “మరింత“ అనే పదానికి బానిస. విద్య, ఉద్యోగం, సొత్తు - ఇవన్నీ ఒక స్థాయిలో ఉన్నప్పటికీ, ఇంకా ఎక్కాలని తపన. సమాజం అతడిని నిరంతరం ప్రేరేపిస్తోంది. ప్రకటనలు ఒక సాధారణ వస్తువును కూడా విలాస చిహ్నంగా చూపుతున్నాయి. వాటిని పొందకపోతే జీవితమే అసంపూర్ణమని మనిషి అనుకుంటున్నాడు. ఈ భావన కోరికలకు బలం ఇస్తోంది.

**సాంకేతిక ప్రభావం:** సాంకేతికత కోరికలకు కొత్త అద్దాలు చూపుతోంది. ఫోన్లు, కార్లు, గృహసామాగ్రి.. ఇవన్నీ త్వరగా పాతబడిపోతున్నాయి. నిన్నటి ఆధునిక వస్తువు నేటి పాత వస్తువుగా మారిపోతుంది. ఈ వేగవంతమైన మార్పు మనిషి మనసులో “కొత్తది కావాలి” అనే మోహాన్ని నింపుతోంది. ఈ మోహం నిజానికి అతనిలోని అసహనాన్ని మరింత పెంచుతోంది.

**ఆర్థిక బంధనం:** కోరికల వెనుక డబ్బు ప్రధాన పాత్ర పోషిస్తోంది. కానీ డబ్బు సమకూర్చుకోవడం కోసం చేసిన పోరాటం మనిషిని దారుణ ఒత్తిడిలోకి నెడుతోంది. డబ్బు సంపాదన కోసమే జీవించడం ఒక భ్రమ. నిజానికి జీవితం డబ్బు కోసమే కాదని తెలిసినా, కోరికలు మనిషిని ఆ దారిలో నడిపిస్తున్నాయి.

**సంబంధాలపై ప్రభావం:** కోరికలు పెరగడం వల్ల మానవ సంబంధాలు మారిపోతున్నాయి. ఒకప్పుడు అనురాగమే బలమైన బంధం. ఇప్పుడు ఆ బంధాల్లో కూడా స్వార్థపు కోణం చోటు చేసుకుంది. స్నేహం, బంధుత్వం, ప్రేమ- ఇవన్నీ కోరికల ఆధారంగా కొలవబడుతున్నాయి. “ఇతను నాకు ఏం ఇస్తాడు?“ అన్న లెక్కలు మనిషిని మరింత ఒంటరితనానికి గురిచేస్తున్నాయి.

## పర్యావరణంపై ప్రభావం

మనిషి కోరికలు భూమి సహజ వనరులపై కూడా భారమవుతున్నాయి. తక్కువ అవసరాల కాలంలో ప్రకృతి స్నేహంగా ఉండేది. ఇప్పుడు అధిక వినియోగం వనరులను దెబ్బతీస్తోంది. నీరు, గాలి, అడవులు, పంటభూములు- అన్నింటినీ మనిషి కోరికలు క్రమంగా దెబ్బతీస్తున్నాయి. చివరికి జీవనానికి అవసరమైన వాతావరణాన్నే నాశనం చేసే స్థితి వచ్చింది. తత్వవేత్తలు కోరికను శక్తిగా భావించారు. దానిని సరైన మార్గంలో మలిస్తే సమాజానికి మేలు జరుగుతుంది. ఒక శాస్త్రవేత్తకు కొత్త ఆవిష్కరణ, ఒక కవికి కొత్త కవిత, ఒక రైతుకు మంచి పంట.. ఇవన్నీ కోరికలే. కానీ ఈ కోరికలు లోభానికి దారి తీస్తే నాశనం తప్పదు. కాబట్టి కోరికను సాధన దిశలో మలచడం, దానిని కట్టడి చేయడం అనివార్యం.

**జీవన సారాంశం:** మనిషి కోరికలు ఒక దారిగా మారితే, తృప్తి ఆ దారికి దిక్సూచి. ఆ దిక్సూచి లేకుంటే జీవనయానం అర్థంలేని ప్రయాణంగా మారుతుంది. తక్కువలో ఆనందాన్ని గుర్తించడం, ఎక్కువలో బాధను గుర్తించడం. ఈ రెండు బోధలు ప్రతి మనిషి గుండెల్లో నాటుకోవాలి. అప్పుడే కోరికల కల్లోలంలోనూ మనసు శాంతిని కనుగొంటుంది.

**- డా. చిటికెన కిరణ్ కుమార్**

# కాకి శకునం

ఒక రాజు తన పండ్ల తోటను అంతఃపురానికి పక్కనే నాటించాడు. అది పరిశుభ్రంగా ఉండాలని, ప్రశాంతతను అందివ్వాలని కోరుకునేవాడు.

ఒకరోజు, మధురంగా మాట్లాడే చిలుకను చూసి ముచ్చటపడ్డాడు. దానిని బంగారు పంజరంలో ఉంచి, తన మందిరంలో పెట్టించాడు.

ప్రతిరోజూ చిలుక రాజును చూడగానే, "మహారాజుకీ జై!" అని రాజుగారిని పలకరించేది.

రాజు ఎంతో ఆనందించేవాడు. రాజమందిరం పక్కనే ఉన్న తోటలో, "కావ్.. కావ్.." అని



బిగ్గరగా అరిచే ఒక కాకి ఉండేది. దాని అరుపులు రాజుకు ఏమాత్రం నచ్చేవి కావు.

"ఈ అపశకునపు కాకిని తోట నుండి తరిమేయండి!" అని రాజు సైనికులకు ఆజ్ఞాపించేవాడు. సైనికులు కాకిని తరిమినా అది మళ్ళీ వచ్చేది.

ఒక అర్ధరాత్రి, రాజుపై పగబట్టిన శత్రువులు రాజును హతమార్చాలని పొదల్లో దాగి ఉన్నారు. ఈ గుసగుసలు చెట్టుపై ఉన్న కాకికి వినిపించాయి. రాజు ప్రాణాలకు అపాయం అని గ్రహించిన కాకి, వెంటనే బిగ్గరగా, "కావ్... కావ్... కావ్!" అని అరవడం మొదలుపెట్టింది.

కాకి అరుపులకు నిద్రలేచిన రాజు, "ఈ కాకిగోల మళ్ళీ మొదలైంది! దీన్ని తరిమేయండి!" అని ఆగ్రహంగా రాజభటులను ఆజ్ఞాపించాడు.

రాజభటులు కాకిని తరమడానికి రాగా, అది తెలివిగా శత్రువులు దాగి ఉన్న వైపు ఎగిరి, అరవడం కొనసాగించింది. భటులు కాకిని అనుసరించి పొదల్లో దాగి ఉన్న శత్రువులను పట్టుకున్నారు.

జరిగిన విషయం తెలుసుకున్న రాజు ఆశ్చర్యపోయాడు. తాను అభిమానించే అందమైన చిలుక నిస్సహాయంగా ఉండగా– తాను ద్వేషించిన కాకి తన ప్రాణాలను కాపాడిందని అర్థం చేసుకున్నాడు. పైపై మెరుగులకూ, తీయటి మాటలకూ మోసపోకూడదని, నిజమైన విలువ రూపంలోగాక, చేసే పనులలో ఉంటుందని తెలుసుకున్నాడు.

రాజు కాకికి కృతజ్ఞతలు చెప్పి, అప్పటి నుండి దానిని గౌరవించాడు. అప్పటి నుండి కాకి తోటలో స్వేచ్ఛగా, సంతోషంగా జీవించింది.

**- డా.పోతగాని సత్యనారాయణ**



**వార్త ఆదివారం**



# బాలగేయం

## క్రమశిక్షణ



బద్ధకాన్ని తన్ని పడేద్దాం
పొద్దు పొద్దున్నే లేద్దాం
శుభ్రంగా తయారవుదాం.

నాన్న చెయ్యి పట్టుదాం
రోడ్లు భద్రంగా దాటుదాం
స్కూల్ బస్సెక్కి పోదాం
బడిలో క్షేమంగా చేరుదాం.

చక్కగా పాఠాలు విందాం
తెలుగులో చక్కగా రాద్దాం
వెన్నెల్లో ఎంచక్కా ఆడుదాం
మంచి పౌరులుగా ఎదుగుదాం.

పెద్దలు చెప్పిన మాట విందాం
ప్రశ్నించి ఎన్నో తెలుసుకుందాం
కొత్త కొత్త ఆవిష్కరణలు చేద్దాం
వీడియోలకు దూరంగా ఉందాం
నీతికథలతో నీతిని
నేర్చుకుందాం.

– పూసాల సత్యనారాయణ

# హలో ఫ్రెండ్...



**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

ఎ.మనోజ్, మహబూబాబాద్

**ప్రశ్న:** ‘ఐ.ఎ.ఆ.ఏ.’ అంటే ఏమిటి?

**జవాబు:** ఐక్యరాజ్యసమితి(యు.ఎన్.ఓ.)కి అనుబంధ సంస్థగా ఉండే ‘ఐ.ఎ.అ.ఎ.’ అంటే ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ. దీని ప్రధాన కార్యాలయం ఆస్ట్రియా రాజధాని వియన్నాలో ఉంది. ఈ సంస్థ 1957లో జూలై 29న ఆవిర్భవించింది. ఇది ఐ.రా.స.కి అనుబంధమే అయినప్పటికీ స్వంతంగా నిర్ణయాలు తీసుకోగలదు.

అణుశక్తిని శాంతియుత ఉపయోగాలకి వాడేందుకు ఈ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో కృషి చేస్తోంది. యుద్ధాల్లో అణుశక్తిని వాడితే అంతా నాశనమే కనుక అణుపరిశోధన, అభివృద్ధి మానవుని శక్తి అవసరాలను తీర్చే దిశగా సాగాలని కృషి చేస్తున్న సంస్థ ఇది.

కె.మణిమేఖల, కర్నూలు

**ప్రశ్న:** ‘రష్‌మోర్’ పర్వత శిఖరం దేనికి ప్రసిద్ధి?

**జవాబు:** అమెరికాలోని ‘సౌత్ డకోటా’కు చెందిన ‘బ్లాక్‌హిల్స్’లో ఉంది రష్‌మోర్ పర్వతం. అంతేగాక, అద్భుతమైన శిల్పకళకు ఈ ప్రాంతం పెట్టింది పేరు.

నలుగురు అమెరికా అధ్యక్షులైన జార్జ్ వాషింగ్టన్, థామస్ జెఫర్‌సన్, అబ్రహం లింకన్, థియోడోర్ రూజ్‌వెల్ట్‌ల మొహాలను పోలి వుండేటట్లుగా ఇక్కడ పర్వత శిఖరాలను చెక్కారు.



# దశావతార అరుదైన ఆలయాలు

చరాచర సృష్టిని నడిపించేది త్రిమూర్తులు అయిన బ్రహ్మ, విష్ణు, శివ. విధాత బ్రహ్మ దేవుడు సృష్టికర్త. శ్రీ మహావిష్ణువు సృష్టి సంరక్షకుడు, సర్వేశ్వరుడు లయకారుడు. సంరక్షణ బాధ్యతలో భాగంగా శ్రీహరి అనేక అవతారాలను ధరించారు. ఆయా అవతారాల వివరాలు మత్స్య, కూర్మ, విష్ణు, బ్రహ్మ, శివ, లింగ, నారద, పద్మ పురాణాలలో పేర్కొన్నట్లుగా తెలుస్తోంది.

ఆ ప్రకారం వైకుంఠ వాసుడు మొత్తంగా ఇరవై రెండు అవతారాలతో సర్వజన సంరక్షణ చేసినట్లుగా గ్రహించవచ్చు. అవి పృథి, మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, రామ, బలరామ, కృష్ణ, వ్యాసదేవ, నారద, మోహిని, ధన్వంతరి, దత్తాత్రేయ, కపిల, రిషభ, హయగ్రీవ, నరనారాయణ, బుద్ధ, కల్కి. ఇవన్నీ మనకి కొద్దో గొప్పో పరిచయం ఉన్నవే! కానీ సుపరిచయమైనవి మాత్రం దశావతారాలు. పది అవతారాలలో రాబోయే కల్కిని తీసివేసి చూస్తే నవావతారాలు. తొమ్మిది అవతారాలలో కూడా నిత్య పూజలు అందుకొనేవి మాత్రం శ్రీ నరసింహ, శ్రీరామ, శ్రీ కృష్ణ. మిగిలిన అవతారాలకు చాలా అరుదుగా ఎక్కడో ఒక ఆలయం కనపడుతుంది.





## దశావతార ఆలయాలు

దశావతారాలలో మొట్టమొదటిది మత్స్య అవతారం. వేదాలను తిరిగి తెచ్చిన స్వామి శ్రీ వేద నారాయణునిగా కలియుగ వైకుంఠం తిరుపతికి సమీపంలోని నాగులాపురంలో దర్శనమిస్తున్నారు. క్షీరసాగర మథనం సక్రమంగా జరగడానికి సముద్రంలో మునిగిపోతున్న మందర పర్వతాన్ని తన వీపున మోసిన శ్రీ కూర్మనాథ స్వామి శ్రీకాకుళం జిల్లా శ్రీ కూర్మంలో కొలువై ఉన్నారు. మరొక శ్రీ కూర్మనాథ స్వామి ఆలయం కర్నూల్ జిల్లా ఆస్పరి మండలం హాలిగేరే గ్రామంలో శ్రీ నల్లగుట్ట కూర్మనాథ స్వామి గుహాలయం ఉన్నట్లుగా తెలుస్తోంది. మోహిని అవతార ఆలయం ఆంధ్రప్రదేశ్ గోదావరి జిల్లా ర్యాలీ గ్రామంలో నెలకొని ఉన్నది. లోకకంటకుడు అయిన హిరణ్యాక్షుని సంహరించి భూదేవిని చెర నుండి విడుదల చేసిన శ్రీ భూవరాహ స్వామి తిరుమల గిరులలో శ్రీవారితో పాటు వసిస్తున్నారు. శ్రీవారు శ్రీ వరాహ లక్ష్మీ నరసింహునిగా దర్శనమిచ్చే అరుదైన క్షేత్రం సింహాచలం. శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి మన తెలుగు రాష్ట్రాలలో ఎన్నో విశేష ఆలయాలు నెలకొని ఉన్నాయి.

స్వామి నవ నారసింహ రూపాలలో కొలువుతీరిన అహోబిలం అన్నింటి లోనికి పావనమైనది. శ్రీ విష్ణు దివ్యదేశాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. బలి ప్రహ్లాదుని మనుమడు సత్యసంధుడూ, శ్రీహరి భక్తుడు ప్రజారంజక పాలకుడు అయినప్పటికీ అసురుడు కనుకే అతను దేవేంద్ర పదవికి అనర్హుడు. ఈ కారణంగా బాలవటువు వామనునిగా వెళ్లి మూడు అడుగుల నేల వరంగా కోరి ముల్లోకాలను బ్రహ్మకడిగిన పాదంతో బలి చక్రవర్తిని పాతాళానికి పంపిన త్రివిక్రమునికి కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆలయం ఉన్నది. బాపట్ల పట్టణానికి సమీపంలోని చెరుకూరు గ్రామంలో పురాతన శ్రీ త్రివిక్రమ స్వామి ఆలయం చోళుల కాలంలోనే నిర్మించబడింది. పదవి తెచ్చిన అహంకారం వలన ప్రజాపీడితులుగా మారిన పాలకులను సంహరించిన శ్రీ పరశురాముని ఆలయం కడప జిల్లా రాజంపేటకు సమీపంలోని బహుదా నది ఒడ్డున చోళుల కాలంలో నిర్మించబడినది.

పాలన అంటే శ్రీరామునిదే! అందుకే రామరాజ్యం అంటారు. జగదానందకారకుడైన శ్రీరామునికి తెలుగు రాష్ట్రాలలో ఎన్నో పురాతన, విశిష్ట ఆలయాలు నిర్మించారు. జాంబవంత ప్రతిష్ఠిత శ్రీ కోదండరామస్వామి వారి ఏకశిలా రూపం కడప జిల్లా ఒంటిమిట్టలో ఉంది.

శ్రీవైష్ణవ సంప్రదాయం ప్రకారం అష్టమ అవతారం శ్రీ బలరాముడు తిరుపతిలోని శ్రీ అలివేలు మంగతాయారు కొలువైన తిరుచానూరు ఆలయంలో ఉన్న ఒక సన్నిధిలో సోదరుడు శ్రీకృష్ణునితో కలిసి దర్శనమిస్తారు. దశావతారాలలో అత్యంత ప్రసిద్ధి చెందినది శ్రీకృష్ణ అవతారం. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ వాసుదేవ ఆలయాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో విశేషమైన వాటి గురించి తెలుసుకుందాం. రెడ్డి రాజులు పాలించిన కొండవీడు సమీపంలోని 'చెంఘీజ్ ఖాన్ పేట (సింగిసాని పేట)'లో స్వయంవ్యక్తగా ప్రసిద్ధికెక్కిన శ్రీ వెన్నముద్ద గోపాలకృష్ణుని ఆలయం. దేవకీనందనుడు ఈ రూపంలో దర్శనమిచ్చిన ఆలయాలు మొత్తం భారతదేశంలో ఆరు మాత్రమే ఉన్నాయని అంటారు.



వాసుదేవుని మరో విశేష ఆలయం సూళ్లూరుపేటకు సమీపంలోని మన్నారుపోలూరు గ్రామంలో ఉన్నది. జగన్నాథుడు జాంబవంతుని యుద్ధంలో ఓడించి అతని కుమార్తె జాంబవతిని వివాహమాడిన ప్రదేశం ఇదే అని అంటారు. రాబోయే అవతార పురుషుడైన కల్కి భగవాన్‌కు కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఒక క్షేత్రం ఉన్నది.

విశాఖ జిల్లా 'ఉపమాక' క్షేత్రంలో శ్రీవారు అశ్వారూఢులై పంచాయుధాలతో, వరద ముద్రతో శ్రీ మహాలక్ష్మీ సమేతులై గరుడాద్రి మీద ఉత్తర ముఖంగా కొలువై ఉంటారు. ఈ విధంగా దశావతార ఆలయాలు కేరళ తరువాత ఉన్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పవచ్చు.

## శ్రీ వామనమూర్తి ఆలయం

మిగిలిన అవతార పురుషులు తమ నిజ రూపాలతో కొలువై దర్శనమిస్తారు. కానీ, ఒక్క శ్రీ వామనమూర్తి మాత్రమే శ్రీ త్రివిక్రమునిగా పూజింపబడతారు. అలా కాకుండా వామనుడు తన నిజ రూపంతో పూజలు అందుకొనే ఒక ఆలయం ఆంధ్రప్రదేశ్‌లో ఉండటం చాలా సంతోషకరం, అవశ్య దర్శనీయం. 'హాఫ్ పేట' గుంటూరు జిల్లాలో చాలామందికి తెలియని చిన్న గ్రామం. గుంటూరు నుండి నందివెలుగు వెళ్లే దారిలో వస్తుందీ గ్రామం. ఈ ప్రాంతంలో ఎన్నో పురాతన, నూతన హిందూ ఆలయాలు నెలకొని ఉన్నాయి. గ్రామస్థుల ముఖ్య వృత్తి వ్యవసాయం.



చాలా సంవత్సరాల క్రితం శ్రీవారు గ్రామ పెద్దకు స్వప్నంలో దర్శనమిచ్చి తాను వామన రూపంలో ఉన్న శిల గ్రామ శివార్లలో పంట భూమిలో ఉన్నదని చెప్పారట. మరునాడు గ్రామస్థులు చెప్పిన గుర్తుల ఆధారంగా వెతకగా వారికి ఒక పెద్ద రాతి శిల లభించిందట. శ్రీవారి శంఖు చక్రాలు తిరునామంతో పాటు రేఖామాత్రంగా కనిపించే శ్రీ వామనమూర్తి రూపం ఆ శిల మీద దర్శనమిచ్చాయట. తమ భాగ్యానికి ఆనందించిన గ్రామస్థులు మేళతాళాలతో స్వామి గ్రామానికి తోడ్కొని వచ్చి చిన్న మందిరం ఏర్పాటు చేశారట.

చాలా సంవత్సరాల పాటు ఆ శిలకే పూజాదులు చేసేవారు. కొన్ని సంవత్సరాల క్రితం గ్రామస్థులు ఆలయాన్ని పునః నిర్మించడంతో పాటు గర్భాలయంలో శ్రీ వామనమూర్తి స్వామిని ప్రతిష్టించడమే కాకుండా ధ్వజస్థంభం కూడా ఏర్పాటు చేసుకొన్నారు.

## ఆలయ విశేషాలు

ప్రధాన రహదారి పక్కనే ఉండే ఈ చిన్న ఆలయం బాటసారుల దృష్టిని ఆకర్షించదు. కానీ ఒకసారి దర్శిస్తే ఎంతో విశేషమైన, అరుదైన ఆలయం అన్న విషయం అర్థం అవుతుంది. తూర్పు ముఖంగా ఉండే ఈ ఆలయంలో ఒక మండపంలో శ్రీ సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీ రామచంద్ర స్వామి పాలరాతి మూర్తులను చిన్న పీఠం మీద ఉంచారు. నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్థంభం ముఖ మండపంలో ఆలయానికి ప్రధాన గుర్తింపు చిహ్నంగా ఉంటుంది.

గర్భాలయానికి ఇరుపక్కలా శ్రీ గణపతి, శ్రీ దాసాంజనేయుడు దర్శనమిస్తారు. గర్భాలయంలో చేతిలో ఛత్రం, దండం, శిరస్సున శిఖ, మెడలో రుద్రాక్షమాల, యజ్ఞోపవీతం. నుదిటిన తిరునామంతో బ్రాహ్మణ వటువు రూపంలో నేత్ర పర్వంగా శ్రీ వామనమూర్తి స్వామి దర్శనం ప్రసాదిస్తారు. స్వామి వారి వెనుక చాలా సంవత్సరాల క్రితం లభించిన శిలను పంచలోహ తొడుగుతో కప్పి ఉంచారు. ఆ తొడుగు మీద స్వామివారి రూపాన్ని శిల మీద ఎలా ఉన్నదో అలా మలిచారు.

ఆలయంలో ప్రతిరోజూ పూజలు జరుపుతారు. పర్వదినాలలో ముఖ్యంగా శ్రీ వామన జయంతి, శ్రీ నృసింహ జయంతి, శ్రీరామ నవమి, ఉగాది, వైకుంఠ ఏకాదశి రోజులలో భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. తప్పక సందర్శించవలసిన అరుదైన, విశిష్ట ఆలయం శ్రీ వామన మూర్తి స్వామి కొలువైనది. హాఫ్ పేటలో ఎలాంటి వసతి, భోజన సౌకర్యాలు లభించవు. అందువలన గుంటూరు నుండి వెళ్లి రావడం ఉత్తమం. అర్చకస్వామి కూడా స్థానికంగా కాకుండా సమీప గ్రామంలో నివాసముంటారు. సమీపంలోనే దేశ విదేశ పక్షుల సంరక్షణ కేంద్రం ఉన్న ఉప్పలపాడు గ్రామం ఉంటుంది. దగ్గరలోని తక్కెళ్లపాడు, నందివెలుగు, కొలకలూరు గ్రామాలలో నెలకొని ఉన్న పురాతన ఆలయాలు దర్శించుకోవడం అభిలషణీయం.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**



కథ

# బ్లాక్ టీ

పి.ఎల్.ఎన్.మంగారత్నం

**ఆరోజు..**

ఉదయం మెలకువ వచ్చేసరికి, వంటగదిలో లైటు వెలుగుతోంది. అలా లైటు వేసినందుకే మెలకువ వచ్చి ఉంటుంది.

శ్రీవారు ప్రతి రోజూ అయిదున్నరకే, లేచి తయారై వాకింగుకు వెళతారు.

పొద్దుటే, లైట్ల నుంచి వెలువడే కాంతి కిరణాలు నాకు అస్సలు నచ్చవు. కళ్ళలో సూదులు గుచ్చుకున్నట్లు .. ఉంటాయి.

నా గదిలో అయితే, ఒప్పుకోనని పక్క గదిలో వేసుకోవడం.

తెల్లవారింది.... అనుకుంటూ మరికాసేపు కళ్ళు మూసుకున్నాను. అలా అని నిద్రపోలేదు. ఓ పది నిమిషాల తరువాత.. ఇంకా ఎంతసేపు పడుకుంటానులే అన్నట్లు లేచాను. కళ్ళు తెరిచేసరికి ఎదురుగుండా గోడ గడియారం సమయం 'ఆరున్నర' చూపిస్తోంది.

కళ్లు చికిలించుకుని మరీ చూసాను. "అయిదున్నరా? అని.. కాదు ఆరున్నరే".

"అదేమిటీ? ఇంతసేపు నిద్రపోయానా? ఇంకా పడుకుంటే పనులు ఎలా తెములుతాయి?" అనుకుంటూ.. మంచం మీద నుంచి దిగ్గున లేచాను.

ఆయన ఎందుకనో వాకింగుకు వెళ్లకుండా ఇంట్లోనే అటూ, ఇటూ పచార్లు చేస్తూ కనిపించారు.

అంటే ఈరోజు బద్ధకిం చేసారన్నమాట.

అంతేలే! ఎవరు మాత్రం అదే పనిగా ఆరోగ్యం అనుకుంటూ శరీరాన్ని అస్తమానం కష్టపెట్టుకోగలరు అనుకుంటూ.. మూడు రోజులకుగానూ, ఆ రోజు వాషింగ్ మిషన్ వేసే రోజు కావడంతో లేచి బాల్కనీ తలుపు తెరిచాను. ఎప్పటి నుంచి కురుస్తుందో గానీ వాన.. బాగానే కురుస్తోంది. చూసి ఆశ్చర్యపోయాను.

తెల్లవారురుఝామున అలాంటి జాడే లేవు. తెల్లవారేసరికే ఇలా..

ఆకాశమంతా మేఘావృతమై, నల్లటి మేఘాలు దట్టంగా అలముకుని, బాగా ముసురు పట్టేసింది. గాలి వాలుకి అనుగుణంగా అలలు అలలుగా పడుతోంది.

ఇందుకే.. ఈ చల్లదనానికే నాకు.. ఇంతసేపు నిద్ర పట్టేసింది.

గది తలుపులు వేసి ఉండడంతో వాన పడుతున్న శబ్దం కూడా తెలియలేదు.

విపత్తులూ, వాతావరణ శాఖ వారు ఈ మధ్య తరచూ వాయుగుండం, అల్పపీడనాల గురించి చెబుతున్నా, ఈదురుగాలులు తప్ప మరేం లేవు మా కోస్తాతీరంలో.

బయటకి చూస్తూ "ఇలా ఉంటే వాషింగ్ మెషిన్ ఏం వేస్తాను?" అనేసాను.. అప్రయత్నంగా నాలో నేనే అన్నట్లు.

"ఎప్పుడూ ఇవే ఆలోచనలు. నిద్ర లేచింది మొదలు ఎప్పుడూ గుడ్డలు ఉతుక్కోవాలి? అక్కడ కడుక్కోవాలి. ఇక్కడ తుడుచుకోవాలి.. అనుకుంటూ" అంటూ ఎద్దేవా చేసారు ఆయన.

ఆ మాటలు పట్టించుకోలేదు. పొద్దుటే అలాంటి అనవసరపు మాటలూ నచ్చవు. రోజు పనులు చేసుకోవడం మొదలు పెట్టాను. మళ్ళీ మరికాసేపు అయితే, అపార్టుమెంటు వాచ్‌మెన్ వస్తాడు...రెండు పెద్ద చెత్త బుట్టలు వేసుకుని, తడి చెత్తా, పొడి చెత్తా పట్టుకెళ్ళడానికి. అలా ప్రతి ఫ్లోర్‌లోనూ అయిదు నిమిషాలు ఉంటాడు. ఎందుకైనా మనం చెత్త వెయ్యకపోతే, అది మరునాటి వరకూ మన దగ్గరే ఉండిపోతుంది.

ఆ తరువాత మంచినీళ్ళు విప్పుతాడు. అవీ రెండు రోజులకు ఒకసారి. 'ఎక్వా గార్డ్' వేసి మంచినీళ్ల పట్టుకోవాలి. ఒక బిందె నిండడానికి పావుగంట సమయం అయినా కావాలి. అవి కూడా ఎంతోసేపు రావు.

అరగంటే వదులుతాడు. అపార్టుమెంటులో ఉన్న ముప్పై కుటుంబాలకు వచ్చేలా.

కాబట్టి ముఖం కడుక్కుని, వాచ్‌మెన్ కోసం ఎదురు చూడసాగాను.

ఆయన, రోజూ వాకింగ్‌కు వెళ్లి, వచ్చేటప్పుడు రెండు పాల ప్యాకెట్లూ. న్యూస్ పేపరూ తెస్తారు.

ఈ రోజు మాత్రం బయట వెళ్ళలేక ఇంట్లోనే తిరుగుతున్నారు.

నేను పాల కోసం ఎదురు చూస్తూ అలాగే కూర్చున్నాను. వర్షం ఏమి తెరిపి ఇవ్వలేదు.

వాచ్‌మెన్ వచ్చి వెళ్ళాడు. కాసేపటికి ఆయనే అన్నారు "బ్లాక్ టీ పెట్టనా ఈ రోజుకి?" అని.

వర్షం ఇప్పట్లో తగ్గేలా లేదు. కాబట్టి, అదే మంచి పని అనిపించి

"ఊ.. " అన్నాను. అలా మా ఉదయపు ఆరాటం తీరింది.

...........

సమయం గడుస్తోంది కానీ వాతావరణంలో మార్పులు ఏమీ లేవు. వాన ఆగకుండా కురవడంతో ఇప్పుడు పనిమనిషిని గురించిన ఆలోచన.

అలా పావు తక్కువ ఎనిమిది గంటల వరకు చూసి ఇక ఈ వర్షానికి బయలుదేరి ఉండదు. ఏడాది క్రితం మా ఇంట్లోనే కాలు జారి పడిపోయింది. అప్పుడు మోకాలి చిప్ప పక్కకు తప్పుకుపోవడంతో ఆపరేషన్ కూడా చేయించుకోవలసి వచ్చింది. కాబట్టి, ఈ హోరువానలో రాలేక పోతూ ఉండకపోవచ్చు.. అనుకుంటూ మెల్లగా వంటగది షింకులో గిన్నెలు వేసుకుని తోముకోవడం మొదలు పెట్టాను.

అలా పది నిమిషాల పాటు తోముకుంటుంటే హాలులో పక్కనున్న బాల్కనీ తలుపు తెరిచిన శబ్దం వినిపించింది.

ఇంట్లో ఉన్న ఇద్దరం అంటే, నేనూ, ఆయనా వంటగదిలోనే ఉండిపోవడంతో ఆ పక్క తలుపు తీసింది పనిమనిషి అమ్ములమ్మే అనిపించింది.

మరో రెండు నిమిషాలకి, అది నిశ్చయం అయిపోయింది. అక్కడి నుండి వెనుక బాల్కానీలోకి వచ్చి అక్కడి వస్తువులు సర్దుతున్న చప్పుడు.

అంటే, అమ్ములమ్మ పనికి వచ్చింది.

"హమ్మయ్య.." అనుకున్నాను బండెడు అంట్లగిన్నెలు తోముకునే కష్టం తప్పినందుకు. అంతటితో చేతులు కడుక్కుని ఇవతలికి వచ్చేసాను.

"ఎలా వచ్చావు?" అని అడగలేదు.

రిక్షాలోనా? ఆటోలోనా? అని వాళ్ళ కాలనీలో ఉండే స్నేహంతో ఎలా అయినా వచ్చేస్తుంది. ఎలాగైతే, వచ్చింది. నాకు కావాల్సింది రావడం. అలా అని తను రాలేకపోయినా నేను ఏమీ అనను. ఆ సంగతి తనకూ తెలుసు. అయితే, చేసేది ఒక్క పూటే

**కాసేపటికి ఆయనే అన్నారు "బ్లాక్ టీ పెట్టనా ఈ రోజుకి?" అని. వర్షం ఇప్పట్లో తగ్గేలా లేదు. కాబట్టి, అదే మంచి పని అనిపించి "ఊ.. " అన్నాను.**

కావడంతో వచ్చి చేసేస్తుంది. నేను ఊరుకున్నా వేరేవాళ్ళు ఊరుకోవాలనేముంది?

నేను అడగనందుకో! ఏమో! తనే చెప్పింది. "బయట గాలి ఇసిరేస్తుందండీ, నడిచి వస్తుంటే, గొడుగు కూడా వెనక్కి తిరిగిపోయింది, కిందే వదిలేసి వచ్చాను" అని.

"అయ్యో!" సానుభూతి చూపించాను. అంతకుమించి ఏం చెయ్యగలను?

మొత్తం గిన్నెలు బయట బాల్కానీలో వేసుకుని పని ప్రారంభించింది అమ్ములమ్మ.

.............

రోజూ మా ఇంటికి వచ్చేటపుడు తన ఇంట్లో 'టీ' తాగి వస్తుందని తెలుసు. అయినా నేను "కాఫీ" ఇస్తూనే ఉంటాను. అయితే ఈరోజు పాలు తీసుకురాని కారణంగా మేం 'బ్లాక్ టీ'తోనే సరిపెట్టుకున్నాం.

అదే అడిగాను "ఇంటి దగ్గర ఏమైనా టీ తాగావా? అమ్ములమ్మా!" అని.

"ఏవండీ?" అంది. ఎందుకీ ఆరా అన్నట్లు.

"ఏం లేదు.. ఈ రోజు వర్షం కారణంగా సారు బయటికి వెళ్ళలేదు. పాలు తేలేదు. మేం 'బ్లాక్ టీ' తాగేసాం. ఇమ్మంటే నీకూ అదే ఇస్తాను" అన్నాను.

"నేను టీ తాగానండి. తెల్లవారుజామున మూడున్నరకే లేచి ఇంటి పనులు తెముల్చుకుని, టీ తాగి మా ఇంటి దగ్గర ఉన్న శివాలయం కూడా వెళ్ళొచ్చాను. పర్వాలేదు లెండి. ఇప్పుడు టీ వద్దు" చెప్పింది కచ్చితంగా. "ఎంత ఓపిక .. అరవై యేళ్ల వయస్సు.

దాదాపుగా నా వయస్సే అయినా, నా కన్నా ఓపికగా ఉంటుంది.

కార్తిక మాసం వస్తే చాలు, తెల్లవారుఝామునే ఏదో గుడికి వెళ్లి వస్తుంది. అలాగే, నాగులచవితికి పుట్టలోనూ పాలు పోస్తుంది.

మొగుడు లేడు. నాలుగేళ్ల కిందట ఓ కూతురూ చనిపోయింది.

అయినా ఎవరి కోసమో! ఈ పూజలు అనుకునేలా. ఇంత వానలో కూడా అలా వెళ్లి వచ్చిందట. అందుకే, పనికి లేటు అయ్యింది.

అమ్ములమ్మ అలా అనడంతో స్టవ్ దగ్గరకు వెళ్ళే పని తప్పిందని అనుకున్నాను. అమ్ములమ్మ పని చేస్తున్నంతసేపు. జల్లు మీదకు కూడా కొడుతుంది. అయినా, అలాగే, కూర్చుని తోముతుంది. వాతావరణ చల్లగా ఉండి వణుకు పుట్టించేలాగా ఉంది .. పాపం అనుకున్నా.

కొందరి జీవితాలు కష్టానికే అలవాటు పడతాయన్నట్లు చూస్తూ ఉండిపోయాను.

నాకు కష్టం తప్పినందుకు సంతోషిస్తూనే.

కాస్సేపటికి బయట పని పూర్తి చేసుకుని, ఇల్లు తుడుస్తూ, ఏమనుకుందో! గాని పొద్దుటే "సారు గారు ఈ వానలో వాకింగ్ వెళ్లి వచ్చేసారా?"

"ఏమిటండీ?" అడిగింది ఏదో మామూలు విషయం అడిగినట్లు నవ్వుతూ.

"ఈ గాలివానలో ఎవరైనా వాకింగుకు వెళ్లగలరా? తనంటే, గత్యంతరం లేని పరిస్థితిలో బయటకి వచ్చిందిగానీ, ఈయన ఎందుకు వెళతారు?"

అలా ఎందుకు అడిగిందో! గ్రహించలేనంత తెలివితక్కువ దాన్ని కాదు. పాలు తెచ్చి ఉంటే, నాకు "కాఫీ ఏదీ?" అన్నట్లు ఉంది ప్రశ్న.

ఆయన రోజూ వాకింగుకి వెళ్లి పాలపేకెట్లు తేవడం ఆ వెంటనే, నేను బ్రూ పౌడరు వేసి 'కాఫీ' పెట్టడమూ, తను కూర్చున్న చోటుకే కాఫీ గ్లాసు అందించడమూ జరిగేది.

ఈరోజు తన బయటి పని అయిపోయినా నేను కదల్లేదని, సందేహ నివృత్తి కోసం అన్నట్లు అడిగింది.

"చెప్పాను కదా! వర్షం వస్తున్నందుకు ఈ రోజు వాకింగ్‌కి వెళ్ళలేదు, పాలు తేలేదు, అందుకే 'బ్లాక్ టీ' పెట్టుకున్నామని అన్నాను కదా!" చెప్పాను.

అప్పటికి విషయం అర్థం చేసుకున్నదానిలా మౌనంగా తుడుపులో నిమగ్నమై పోయింది.

నాకు మాత్రం చాలా సిగ్గుగానూ .. గుండె కోసినంత బాధగానూ అనిపించింది.

వాన కారణంగా .. ఒక్క రోజు కాఫీ ఇవ్వలేకపోయినందుకు అడిగించుకోవాల్సి వచ్చిందని. ఆమెకి బ్లాక్ టీ అంటే అర్థం తెలిసి ఉండదని అప్పుడనిపించింది.

ఇంట్లో మేం అలవాటుగా అనుకునే మాటనే అనేసాను.

నా నుంచి 'టీ' అన్న పదం వినగానే 'పాల టీ' అనుకుని ఉంటుంది. అందుకే మరోసారి 'టీ' తాగడం ఎందుకు



అనుకుంటుందో! ఏమో! వద్దంది. అయినా ఎప్పటిలా తన 'కాఫీ' ఉంటుందని అనుకుని ఉండవచ్చు.

అలాగని నేనూ దాని అర్థం వివరించి చెప్పలేదు .. బ్లాక్ టీ అంటే టీ 'డికాక్షన్' అని.

ఏది ఏమైనా! పనిమనిషితో అలా అడిగించుకోవడం బాధగానే అనిపించినా ఏమీ మాట్లాడలేదు. కారణం, ఆ బాల్కనీలోకి జల్లు కొడుతున్నా అలానే కూర్చొని పని చేసింది ఒళ్ళంతా తడిసి ముద్దవుతున్నాగాని. రోజూ అందే వెచ్చని 'కాఫీ' ఆ రోజు అందకపోవడంతో విషయం గుర్తు చేసినట్లుగా చేసింది.

ఒక్కోసారి పరిస్థితులు అలాగే ఉంటాయి అన్నట్లు. పోనీ, తరువాత పని చేసేవాళ్ళ ఇంట్లో తాగుతుందిలే! అనుకుందాం.. అనుకున్నా అక్కడ అంత పని ఉండదు. ఇల్లు తుడిచి, తడిబట్ట పెట్టడమే. కాబట్టి, అక్కడ పెట్టుపోతల ప్రసక్తి ఉండదు.

..............

పది గంటలకు కాస్త వర్షం కాస్త తెరిపి ఇస్తే భోజనం చేసిన తరువాత బయటకి వెళ్లి పాలూ, పేపరూ తీసుకు వచ్చారు శ్రీవారు.

రెండు పెకెట్లలో చిన్నది తీసి, ఫ్రిజ్‌లో పెడుతూ "ఇది రేపటికి, ఎందుకైనా రేపూ ఇలాగే ఉంటే ఉంటుందని" అన్నాను.

"నీ ఇష్టం" అన్నారు ఆయన, ఎలా అయినా తనకేం ఫర్వాలేదన్నట్లు.

"మీ కోసం అనుకున్నారేమో! కాదు. అమ్ములమ్మ కోసం" చెప్పాను... ఈ ముసురు నాకు ఏదో తెలియని పాఠం చెప్పినట్లు అనిపించింది. •


## కార్టూన్లకు ఆహ్వానం

**కార్టూనిస్టుల నుంచి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

sunmagvaartha@gmail.com




# జీవాల జీవన సందేశం

**పుస్తక సమీక్ష**

ఆర్.సి.కృష్ణస్వామి రాజు మొట్టమొదటి నవల 'మేకల బండ'లో ఏకాదశి నుండి పున్నమి వరకు ఐదు రోజుల కథనం మనం ఊహించలేని చిత్ర విచిత్రాలతో కదిలింపచేస్తుంది. రచయిత పుట్టి పెరిగిన పల్లె, మట్టి, గుట్ట, కొండకోనలలో నడిపించిన ఈ నవల మనల్ని వినూత్నంగా నాలుగు జీవాల జీవన, నేపథ్యంలోకి తీసుకువెళ్లి, ఆలోచింపచేస్తుంది.


పల్లెకు దూరంగా కాపరుల కళ్లు కప్పి పారిపోయిన జీవాలు, ఈ నవలకు కథానాయిక, నాయకులుగా చదువరులను ఆకట్టుకోవడం ఫాంటసీ సృష్టించిన రచయిత అంతటితో ఆగలేదు. ఆ నాలుగు జీవాలు మనుషుల్లా బతకాలని, తెలివైన బతుకులతో మానవుల్లా ఆలోచించి మాట్లాడి వ్యవహరించి ఆనందంగా బతకాలని పారిపోయిన నెపం, కల్పించి కథ నడిపిస్తారు. కుళ్లు, కుతంత్రాలు, స్వార్థం, అసూయ, ద్వేషం వంటి దుర్గుణాలతో మనుషులు జీవనం సాగిస్తున్నారని ఆ అమాయక జీవాలు గ్రహించేవరకు వెదుకులాట సాగుతుంది. జీవాలు పోగొట్టుకున్న సుందరం, పెంచల్ రాజు, తిరుపాలు, వడివేలు జీవాల యజమానులుగా తమ మేకపోతు, నల్లగొర్రె, తెల్లపొట్టేలు, కుంటిమేక మందలలోంచి తప్పించుకుపోవటం కారణంగా, అన్వేషణ యాత్రలో ఎదుర్కొన్న జీవన వేదన ఎన్నో చిన్న సంఘటనలు రచయిత పాత్రల ప్రశంసనీయతతో కల్పించి రక్తి కట్టించారు. బుద్ధిజీవులైన మానవులు జీవించే ధోరణులను, స్వార్థ, అసూయ, వివక్షతలను జీవన మార్గాన్ని, నోరులేని జీవాలకు ఒక విచిత్ర అనుభవం కల్పించటంలో రచయిత ఊహాభావన, అరుదైన కల్పనా చమత్కృతి సునిశిత వ్యంగ్య హాస్య శైలి చదువరులను ఆకట్టుకుంటోంది. మనుషుల ఆలోచనల కారణంగా పాపభీతి, న్యాయం, ధర్మం లేని వక్రమార్గం అనుసరించిన, ఆ జీవాలు, మాకు మాట్లాడే శక్తి, మనుషుల్లా ఆలోచనలు వద్దని ఇంటిదారి పట్టడం, మనసు మార్చుకొని కాలం ఇచ్చినది ఏదైనా సరే అలాగే బతకాలని సంతోషంగా చిరుగంటలు మోగిస్తూ అడుగులు వేయటంతో నవల సందేశాత్మకంగా 'జీవాల ద్వారా జీవన సందేశం' అందిస్తోంది.

**(మేకల బండ(నవల)రచన: ఆర్.సి.కృష్ణస్వామి రాజు; ప్రతులకు: ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 22-4-71, బ్యాంక్ ఎంప్లాయీస్ కాలనీ, మంగళం రోడ్, తిరుపతి-517 507; ప్రముఖ పుస్తక కేంద్రాలు)**

– జయసూర్య

# గోమాత వైభవం

గోమాతను పరమేశ్వరిగా పూజించే గోస్వామి డా.నిట్టల గోపాలకృష్ణ, గోమాత సేవా ట్రస్ట్ ప్రచురణగా 'శ్రీమాతే గోమాత' ప్రచురింపచేసారు. లలితా సహస్రనామాల్లోని 108 నామాలు స్వీకరించి శ్రీమాతను గోమాతను ఆరాధనా సమసమానంగా దానికి దీటుగా గోమాత వైభవాన్ని, పవిత్రతను డా.గోపాలకృష్ణ సార్థక నామధేయునిగా సాక్షాత్కరింపచేసారు. గోమాత ఆజ్ఞానుసారం, శృంగేరి పీఠాధిపతుల పవిత్ర ప్రేరణతో, నిరంతర గోమాతా చింతనాపరులైన గోస్వామి గోపాలకృష్ణ, ఆధ్యాత్మిక తాత్త్విక పరిజ్ఞానంతో అష్టోత్తర శతానామాలను తీసుకొని, ఆ నామాల ప్రాశస్త్య ప్రస్తావన కలిగివున్న వేద, పురాణ, ఉపనిషత్ తదితర శాస్త్రాధ్యయనంతో 'శ్రీమాతే గోమాత' వెలువరించారు. ఒక్కొక్క నామ పరంగా గోపవిత్రత సంబంధిత వ్యాఖ్యానంతో సమన్వయపరుస్తూ గోప్రేమికులకు, భక్తులకు అంతరార్థాన్ని ఆవిష్కరింపచేసారు.




గోవిజ్ఞాన సర్వస్వాన్ని ఉద్గ్రంథంగా రూపొందింపచేసిన, గోపాలకృష్ణ గోసేవకు, గోసంరక్షణకు అంకితమవటమే కాకుండా, గోసంబంధిత సాహిత్యాన్ని సృజనాత్మక పరిశోధనా దృష్టితో రచించటం ఆదిపరాశక్తి అయిన శ్రీమాతను స్తుతిస్తూ గోమాత జగన్మాతగా ఈ పారాయణ గ్రంథం వెలువరించటం సుకృతం. పూర్వాశ్రమంలో వెండితెర వెలుగులు విరజిమ్మిన లక్ష్మణరేఖ గోపాలకృష్ణ, గోమాత ఉపాసకులుగా, భక్తి తత్పరతతో వెలువరించిన ఈ పారాయణ గ్రంథం ఎందరో ఆముష్మికులను తరింపచేస్తుంది.

**(శ్రీమాతే గోమాత-రచన: డా॥ నిట్టల గోపాలకృష్ణ (గోస్వామి); వెల: రూ.50/-లు; ప్రతులకు: గోమాత సేవా ట్రస్ట్, 202, శివసాయి సదన్, శ్రీనివాసపురం, రోడ్ నం.3, రామంతాపూర్, హైదరాబాద్13)**

– యర్రమిల్లి

## స్వీకారం



**శకత్రిశతి**
(పద్యాల హాస్యగుళికలు)
రచన: టి.హెచ్.నటరాజా రావు
ప్రతులకు: టిహెచ్ విమలారాణి
ప్లాట్ నం.133-134,
సెక్రటేరియట్ కాలనీ
మణికొండ,
హైదరాబాద్-500 089

**మనిషీ! మళ్లీ ఒకసారి సిగ్గుపడు**
(వచన కవితా సంహిత)
రచన: అవధానం టిహెచ్ నట రాజారావు ప్రతులకు: టి.హెచ్. విమలారాణి
12, కన్వకుటీర్, రోడ్ నం.13, అలకాపురి టౌన్‌షిప్,
కుందన్‌నగర్/స్వాతిక్‌నగర్
పుప్పాలగూడ,
భాగ్యనగరం-500 089

**గజేంద్ర మోక్షణం**
రచన: టి.శాంతాభాస్కర్
ప్రతులకు: లోకేష్ ప్రచురణలు,నం. 2-711/2,
షాహుకార్ బంగ్లా వీధి
కొంగారెడ్డిపల్లి,
చిత్తూరు-517 001.

# అపర భక్తుడు.. చైతన్య మహాప్రభు

**కృష్ణుడి** పట్ల పరిపూర్ణమైన భక్తి మాత్రమే ముక్తికి సరైన మార్గమని చాటి చెప్పిన చైతన్య మహాప్రభు శ్రీకృష్ణుడి పట్ల ప్రేమ అత్యున్నత లక్ష్యమై ఉండాలన్నారు. శ్రీకృష్ణుడు దివ్యశక్తి, జీవశక్తి, భౌతిక శక్తులకు మూలమని ఆయన అభిప్రాయం. జీవులన్నిటికీ మూలమైన శ్రీకృష్ణుడు అనంత సత్యమని చెప్పిన ఆయన బెంగాల్, ఒడిషాలలో రాధాకృష్ణ మతాన్ని ప్రచారం చేశారు.

జగన్నాథ మిశ్ర, శచీదేవి ద్వారా మొదట్లో పుట్టిన బిడ్డలందరూ దాదాపుగా పసి వయస్సులలోనే మరణించారు. ఆ తర్వాత ఈ దంపతులకు ఇద్దరు మగబిడ్డలు పుట్టారు. వారిలో పెద్దవాడు విశ్వరూపుడు; చిన్నవాడు విశ్వంభరుడు. ఈయన 1486 ఫిబ్రవరి 18వ తేదీన నవద్వీపం (ప్రస్తుతం దీనినే నదియా అని అంటున్నారు)లో జన్మించారు.



చిన్నతనంలోనే సన్యాసం స్వీకరించిన చైతన్య మహాప్రభును కొందరు గౌరాంగుడు అని పిలిచేవారు. తోటి పిల్లలేమో ఆయనను నిమాయి అని పిలిచేవారు. నిమ్మచెట్టు కింద జనించిన కారణంగా అలా పిలిచి ఉండవచ్చని మరికొందరి అభిప్రాయం.

ఆయన చిన్నతనంలోనే సకల శాస్త్రాలూ, పురాణేతిహాసాలూ చదివి మహాపండితులయ్యారు. ఆయనకు తర్కం, వ్యాకరణం ఎంతో ఇష్టమైన విషయాలు. పదహారవ యేట నవద్వీపంలో ఓ పాఠశాల స్థాపించి ఎందరో విద్యార్థులకు తర్క, వ్యాకరణాలు బోధించారు. సంస్కృతంలో ఒక వ్యాకరణ గ్రంథం కూడా రాసిన గౌరాంగుడు తన 11వ యేట తండ్రిని కోల్పోయారు. తండ్రికి శ్రాద్ధ కర్మలను నిర్వర్తించడానికిగాను తన 23వ యేట గౌరాంగుడు గయ వెళ్ళారు. అక్కడ ఒక విష్ణువు ఆలయంలో పూజలు చేస్తుండగా ఆయన భగవంతుని పట్ల అపారమైన భక్తి భావంతో తన్మయులైపోయారు.

ఆయన స్థితి గమనించిన ఈశ్వరపురి అనే సాధువు ఆయన మహాభక్తుడు కాగలడని తలచి కృష్ణుడికి సంబంధించిన మంత్రోపదేశం చేసారు.

సన్యాసాన్ని స్వీకరించిన తర్వాత “శ్రీ చైతన్య మహ ప్రభువు”గా ప్రసిద్ధి పొందిన ఆయన గయ నుండి నవద్వీపం తిరిగి వచ్చిన తర్వాత పాఠశాలను మూసి వేసి, నిరంతరమూ కృష్ణ ధ్యానంలో, కృష్ణ సంకీర్తనంలో మునిగిపోయారు. కొంత కాలం జగన్నాథ క్షేత్రమైన పూరీలోనూ, మరికొంత కాలం బృందావనంలోనూ గడిపిన ఆయన పన్నెండేళ్ళు సగం సమాధి స్థితిలోను, సగం జాగ్రదావస్థలోను గడిపారు. కృష్ణవియోగ వేదనలోని సుఖాన్ని అనుభవించిన ఆయన ఒక ప్రత్యేక మతాన్ని, సిద్ధాంతాన్ని స్థాపించకపోయినప్పటికీ ఆయన శిష్యులు తర్వాతి కాలంలో బ్రహ్మసూత్రాలకు ఆయన కోణంలో నుంచి భాష్యంతో పాటు, ఆయన సిద్ధాంతాలకు విస్పష్ట రూపం కల్పించి అనేక గ్రంథాలు రాశారు.

‘హరే రామ హరే కృష్ణ’ మహామంత్రాన్ని చెప్తూ ఆనందనృత్యం చేస్తూ మధురమైన భక్తి మార్గాన్ని బోధించారు. ప్రేమ అనే పదాన్ని అధిక శాతం మంది చాలా తేలిక భావంతో వాడుతుంటారు. అయితే నిజమైన ప్రేమను అనుభవించిన వారిని మానవ చరిత్రలో వేళ్ళ మీద లెక్కించవచ్చు. పరిపూర్ణమైన భక్తిని బహు కొద్ది మంది మాత్రమే అందుకుని ఉంటారు. వారిలో ఒకరు చైతన్య మహాప్రభు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆయన రాసిన శిక్షాష్టకం సుప్రసిద్ధమైనది. ‘నామ్నామకారి బహుదా తన సర్వ శక్తి స్తత్రారిపతా’ అంటూ భగవన్నామాన్ని సర్వ శక్తిమంతమని బోధించారు. కృష్ణుడు తానే అని తన నిజ స్వరూపాన్ని అద్వైత గోస్వామి, నిత్యానంద గోస్వామి అనే శిష్యులకు దర్శనం ఇచ్చినట్లు ఆయన జీవితగాథలో ఉంది. ఆయన సిద్ధాంతాన్ని అచింత్య భేదాభేదమని అంటారు.

ఆయన మతానికి అవి ప్రామాణికాలయ్యాయి. ఆయన సనాతన గోస్వామి, జీవ గోస్వామి తదితర ఆరుగురు గోస్వాములు మహనీయులైన శిష్యులుగా చరిత్రపుటలకెక్కారు. పవిత్ర జీవనం, ప్రేమమయ సంకీర్తనం, భకితతో నామజపం అనే సూత్రాలపైన ఏర్పడిన బెంగాల్ వైష్ణవ సాంప్రదాయానికి ఈయనే ఆద్యులు. దీనిని గౌడీయ శాఖ అని అంటారు. ఆధునిక కాలంలో ఈ సంప్రదాయానికి చెందిన శ్రీ భక్తి వేదాంత ప్రభుపాదగోస్వామి ‘హరే రామ హరే కృష్ణ’ సంఘాన్ని వివిధ దేశాలలో విస్తరించారు. ఆయన భౌతిక శరీరాన్ని విడిచిన తీరుపైన భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. శ్రీ చైతన్యుల వారు 1534 జూన్ 14వ తేదీన తన 48వ యేట జగన్నాథాలయంలో పూజ నిమిత్తం తలుపులు తెరచుకుని లోపలికి వెళ్ళినవారు వెళ్ళినట్టే మహా ప్రస్థానం చెందారని కొందరంటే; ప్రేమ భక్తిలో మైమరచిపోయి ఓ నదిలో స్నానం చేస్తుండగా నీటిలో మునిగి తనువు చాలించారన్నది మరొక కథనం.

**- యామిజాల జగదీశ్**

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458




# కొనగూడని స్థలాలు ఉంటాయా?

**ఎస్.కార్తిక్, విజయవాడ**

ప్రశ్న: కొనగూడని స్థలాలు **ఉంటాయా?**

**జవాబు:** ఒక స్థలం స్వరూపం, స్వభావాన్ని బట్టి ఆ స్థలం ఇచ్చే మంచి, చెడు ఫలితాలు నిర్ధారింపబడతాయి. అయితే చాలా సందర్భాలలో స్థల 'స్వభావం' ఎలా వున్నప్పటికీ 'స్వరూపం' వాస్తు యోగ్యం కానప్పుడు ఆ స్థలం



కొనదగిన స్థలం కాదు. అలా కొనకూడని స్థలాల గురించి వాటి ఫలాఫలాల గురించి వివరంగా తెలుసుకోవడం వలన మనం కొనబోయే స్థలాలు కొనదగినవో, కాదో నిర్ధారణ చేసుకోవచ్చు. ఒక స్థలం కొన్న తరువాత ఆ స్థల ప్రభావం యజమానికి వెంటనే కనిపిస్తుంది. కొనకూడని స్థలాలు కొని అవసరంగా రకరకాల ఇబ్బందులు పడి, ఆ తరువాత వాస్తు బాగాలేదని అమ్మివేయటం పరిపాటి.

కానీ ఆ స్థలాన్ని కొని, తిరిగి అమ్మివేయటం మధ్యనున్న కాలంలో పొందిన కష్ట, నష్టాలను పూడ్చివేసుకోవటానికి చాలా సమయం పడుతుంది. కొన్ని సందర్భాలలో తిరిగి పూడ్చుకోలేనంత నష్టాలు కూడా జరిగిపోతూ ఉంటాయి. బాగాలేని స్థలాల గురించి అవగాహన వుంటే అటువంటి స్థలాలను కొనకపోవటం వల్ల ఎన్నో రకాల కష్ట, నష్టాల నుండి తప్పించుకోవచ్చు. ధనాన్ని, సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. అలాగే కుటుంబ సభ్యుల మధ్యన, మానవ సంబంధాల విషయంలోనూ అపార్థాలు, అనర్థాలు కలగకుండా జాగ్రత్త పడవచ్చు.

## త్రిభుజాకార స్థలం దేనినంటారు?

**సి.మనోజ్, హైదరాబాద్**

ప్రశ్న: త్రిభాజాకార స్థలం అంటే **ఏమిటి?**

**జవాబు:** మూడు కోణాలు, మూడు భుజాలు కలిగి వున్న స్థలాన్ని 'త్రిభుజాకార స్థలం' అంటారు. ఇది వాస్తుయోగ్యం కాదు, గృహ నిర్మాణానికి పనికిరాదు. ఇటువంటి స్థలంలో ఇల్లు నిర్మించుకొని అందులో నివసించేవారుగానీ, వ్యవసాయం, వ్యాపారం చేసేవారుగానీ నిరంతరం శత్రుభీతితో ఆందోళనకు లోనయ్యే అవకాశాలు ఎక్కువ. స్థలం ఎంత వున్నా, ఎలా వున్నా ఏ రకమైన త్రిభుజాకారం కలిగి వున్నా దాదాపు చెడు ఫలితాలు ఒకే మోస్తరుగా ఉంటాయి. స్వభావరీత్యా ఆ క్షేత్రం 'బాగుంటే' చెడు పలితాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఏ విధంగా కూడా ఫలితం బాగుండదు. కనుక ఇటువంటి స్థలాలు కలిగి వుండకపోవటమే మంచిది.

## నైరుతిలో టాయిలెట్స్ ఉండవచ్చా?

**కె.పాండురంగ, కోదాడ**

**ప్రశ్న: ప్రస్తుతం మేం వుంటున్న ఇంటిని సుమారు ముప్పై యేళ్ల క్రితం నిర్మించారు. ఈ ఇల్లు పడమటి ముఖ ద్వారం. ఇప్పుడు ఈ ఇంటిని పడగొట్టి కొత్తగా నిర్మించాలని అనుకుంటున్నాం. మేం ఇద్దరం అన్నదమ్ములం. మా తమ్ముని పేరు మీద/ నా పేరుమీద పడమటి ముఖద్వారం ఉండవచ్చా?**

**నైరుతిలో ఇప్పుడు వేపచెట్టు వున్నది. ఆ చెట్టుకు పూజలు చేయరు. కొత్తగా నిర్మిస్తే నైరుతిలో టాయిలెట్స్ కట్టవచ్చా?**

**జవాబు:** మీ తమ్ముడి పేరుతో పడమర ముఖద్వారం యోగిస్తుంది. వేపచెట్టును తీసివేయకూడదు. ఇంటి కట్టుబడి స్థలంలో నైరుతి మూలన టాయిలెట్స్ కట్టకూడదు. ఇంత కాలం మనకు ఆశ్రయమిచ్చిన పాత ఇంటిని పడగొట్టే ముందు చేయవలసిన సాధారణ 'శాంతి ప్రక్రియలు' ఉంటాయి. వాటిని ఆచరించాల్సిందే! యాంత్రికంగా కూల్చేయటం వల్ల నూతన గృహ నిర్మాణంలో అనేక అవరోధాలేర్పడే అవకాశం ఉంటుంది. ఆ చిన్న శాంతి ప్రక్రియలు చేసుకోవటం వలన నూతన గృహ నిర్మాణం సజావుగా సాగుతుంది. ఫలితాలు కూడా బాగుంటాయి.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

వాస్తువార్త

పూర్తి పేరు : ............................................
పుట్టిన తేది : ............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................
చిరునామా:...............................................

**పాన్ షాపుల్లో స్వీట్ పాన్ టూత్ పిక్‌కు ఎర్రని పండు గుచ్చి ఉండడం చూసే ఉంటాం. తియ్యని రుచి కలిగిన ఆ పండ్లు చెర్రీస్ అని అనుకుంటారు చాలా మంది. కానీ అవి వాక్కాయలు అనే విషయం ఎవ్వరికీ తెలియదు. ఈ పండ్లను ఎండబెట్టి టూటీ ఫ్రూటీగా తయారు చేయడంతో పాటు కేకులు, సలాడ్ల అలంకరణలో ఉపయోగిస్తారు.**





పిల్లలు మొదలుకుని పెద్దల వరకూ ప్రతి ఒక్కరూ ఇష్టపడే ఈ పదార్థాలన్నింటినీ చేసేది సహజసిద్ధంగా దొరికే కలిమె పండ్లతోనే. ఈ కాయలను దుకాణాలలో దొరికేటువంటి చెర్రీలు.. బెర్రీలు అని చెప్పి ఎర్రగా ఉండే కాయల్ని తింటారు. అది రెండు భాగాలుగా ఉంటుంది. దీనిని పైన చెప్పిన రాష్ట్రాల వారు దానిని పంచదార పాకము ఎరుపు రంగు ఎసెన్స్‌లో ముంచి దేశం అంతా కూడా అమ్ముతుంటారు. ఇది సామాన్యంగా ప్రతి చోటా కూడా దొరికే పదార్థం. ఈ వాక్కాయలను కోసేటప్పుడు జిగురు కలిగిన పాల లాంటి పదార్థం కొంచెం విడుదలవుతుంది.


# వాక్కాయలతో ఫలితాలు మెండు

ఈ కాయలు లేత గులాబీ రంగులో పుల్లగా ఉంటాయి. చాలా ప్రాంతాలలో వీటితో పచ్చడి, పప్పు వంటి వంటకాలు చేస్తుంటారు. అడవి ప్రాంతాలలో వాక్కాయ చెట్లు ఎక్కువగా పెరుగుతాయి. చాలా మందికి వాక్కాయలతో వంటలు చేస్తారని తెలుసు కానీ వాటితో కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలియదు. అవేంటో తెలిస్తే వాక్కాయలు ఎక్కడ కనిపించినా వాటిని వదలలాని అనిపించదు. వర్షాకాలంలో మెట్ట ప్రాంతాల్లో, తోటలు, చేను గట్లపై విరివిగా కాసే ఈ పండ్లు తెలియని వారుండరు. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో ఇవి అందరికీ సుపరిచితమే.

వారాంతపు సంతల్లో వీటిని కుప్పలుగా పోసి అమ్ముతుంటారు. కొంత మందికి అవి ఏమిటో తెలియకున్నా రంగు, పరిమాణం చూసి ఆకర్షితులవుతుంటారు. కలిమె పండ్ల చెట్లకు ముళ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఎత్తుగా, పొదలా పెరుగుతాయి. తోటల చుట్టూ వీటిని పెంచుకుని అటవీ జంతువులు రాకుండా అడ్డుకుంటున్నారు. మరోవైపు సీజన్‌లో వచ్చే ఈ పండ్లతో వివిధ రకాలైన పదార్థాలు తయారు చేసి అదనపు ఆదాయం పొందుతున్నారు. వాక్కాయతో పులిహోర, మాంసం వాక్కాయ, వాక్కాయలతో వివిధ రకాల పచ్చళ్లు వంటి అనేక రకాల వంటలను తయారు చేస్తారు. అడవులలో సహజసిద్ధంగా పెరిగే ఈ మొక్కల నుండి పండ్లు వర్షాకాలంలో కొన్ని రోజులు మాత్రమే లభిస్తాయి.

చింతపండుకు బదులుగా ఎక్కువగా వాడుతుంటారు. పప్పులో వేయడంతో పాటు రోటి పచ్చళ్లు తయారు చేసుకుంటారు. ఆవకాయ, పచ్చిమిర్చి కలిపి నిల్వ పచ్చడి కూడా పెట్టుకుంటారు.

వాక్కాయ చెట్లు చూడడానికి చిన్న సైజు రేగు చెట్టులా ఉంటాయి వీటికి అక్కడక్కడ ముళ్ళు కూడా ఉంటాయి. ఈ వాక్కాయ లేతగా ఉన్నప్పుడు పూర్తి లేత ఆకుపచ్చ రంగులో ముదురుతున్నప్పుడు ఎరుపు ఊదా రంగు ఆకుపచ్చ రంగు కలిసినటువంటి రంగు ఉంటాయి. ఈ వాక్కాయల్లో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. అందరూ తినదగ్గ కాయ వాక్కాయ. దీనితో వాక్కాయ కందిపప్పు, పెసరపప్పు, వాక్కాయ కొబ్బరి కలిపి పచ్చడి చేసుకుంటారు. వాక్కాయతో తాత్కాలిక ఊరగాయ చేసుకుంటారు. ముదిరిన వాక్కాయలు తీసుకొని దానిని రెండు భాగాలుగా చేస్తే లోపల లేత గింజ ఉంటుంది. అది తీసేయాలి. ఈ వాక్కాయ తోటలను గత నాలుగు దశాబ్దాల నుంచి పంజాబు, హర్యానా చండీగర్‌లో ఎక్కువగా పండిస్తున్నారు.



బజారులో చాలా

వీటిని సాధారణంగా భారతీయ ఊరగాయలు, సుగంధ ద్రవ్యాలలో రుచి కోసం కలిపే ఒక పదార్థంగా ఉపయోగిస్తున్నారు.

### ఔషధ గుణాలు

వాక్కాయలను కాన్ బెర్రీస్ అని కూడా అంటారు. వీటిలో మధుమేహాన్ని నివారించే ఎన్నో ఔషధ గుణాలు ఎక్కువగా ఉన్నాయని జర్మనీలోని డ్యూసెల్ డోర్ఫ్ యూనివర్శిటీ శాస్త్రవేత్త అనారోడ్రిగ్స్ తెలిపారు. వాక్కాయలు కొంచెం వగరుగా, పుల్లగా ఉంటాయి. భారత క్రాన్ బెర్రీస్‌గా పిలవబడుతూ మూత్రపిండాలలో రాళ్లని కరిగించేవిగా, మూత్ర నాళాలని శుభ్రపరిచేవిగా ప్రసిద్ధి చెందాయి. విటమిన్ సి అధికంగా ఉన్న ఈ వాక్కాయలు అద్భుతమైన యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫలమేటరీ గుణాలు కలిగి ఉంటాయి.



ఉబ్బసం చికిత్స నుండి చర్మ వ్యాధుల వరకు, వాక్కాయలు శరీరానికి చాలా ప్రయోజనాలను చేకూరుస్తాయి. వాక్కాయలు విటమిన్ బి, సి, ఐరన్ రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. పీచు పదార్థం ఎక్కువగా వున్నందువల్ల కడుపు ఉబ్బరాన్ని అడ్డుకుని అజీర్తి సమస్యకు ఔషధంలా ఉపయోగపడుతుంది.

ఈ పండ్లలోని పెక్టిన్ అనే కార్బోహైడ్రేట్ జీర్ణవ్యవస్థను మెరుగుపరిచి ఆకలిని పెంచుతుంది. విటమిన్స్‌తో పాటు ట్రిప్టాఫాన్ అనే అమైనో యాసిడ్ సెరటోనిన్‌ను ఉత్పత్తి చేయడం వల్ల అవి ఒత్తిడిని తగ్గించి మెదడును చురుగ్గా ఉంచుతాయి. ఇంకా వీటిలోని పోషకాలు కాలేయాన్ని, రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటు శరీరంలో కొవ్వు నిల్వలు పేరుకుపోకుండా సహకరిస్తాయి. వాక్కాయలు శ్వాసకోశ పరిస్థితులను మెరుగుపరచడం మొదలుకుని చర్మవ్యాధులకు చికిత్స చేయడం, మధుమేహాన్ని నివారించడం లాంటి ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఫైబర్, విటమిన్ సి అధిక మోతాదులో లభించే కలిమె పండ్లలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఆస్తమా, చర్మవ్యాధి బాధితులకు ఎంతో మేలు చేస్తాయి వాక్కాయలు. ఇవి మూత్ర నాళాన్ని శుభ్రపరచడంతో పాటు కిడ్నీలో రాళ్లు కరిగిపోయేలా సహకరిస్తాయని నిపుణులు వెల్లడిస్తున్నారు.

వీటిని ఉత్తర తెలంగాణలో వాక్కాయ అని, దక్షిణ తెలంగాణలో కలింపండ్లు, కలేక్కాయ అని అంటారు. ఓ వైపు ఎరుపు, గులాబీ రంగు కలగలిపి, మరో వైపు ఆకుపచ్చ రంగుతో నోరూరించే ఈ పండ్లు రుచి విషయంలో కాస్త వగరు, ఎక్కువ పులుపు రుచిని కలిగి ఉంటాయి. ఈ పండ్లతో కూరలు, పచ్చళ్లతో పాటు రకరకాల వంటకాలు తయారు చేసుకుంటారు.

ఆరోగ్య పరంగానూ ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. సీజన్‌లో దొరికే వాక్కాయను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఉపయోగపడుతుంది. వీటిలో విటమిన్లు, ట్రిప్టోఫాన్లతో పాటు మెగ్నీషియం ఉండటం సిరోటోనిన్ ఉత్పత్తిని ఉత్తేజపరచడంలో సహాయపడుతుంది.

వాక్కాయ జ్యూస్ తాగడం వలన గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. గుండె కండరాలను బలోపేతం చేయడానికి రోజూ 15 నుండి 20 మి.లీ వాక్కాయ రసం తీసుకోవచ్చు. శరీరం డీహైడ్రేషన్ బారిన పడితే.. తక్షణ శక్తిని ఇస్తుంది. అంతేకాదు శరీరంలోని మంటను తగ్గిస్తుంది. వాక్కాయ శరీరంలోని పిత్తాశయం, చిగుళ్ళలో రక్తస్రావం, అంతర్గత రక్తస్రావం వంటి ఎన్నో సమస్యలను నివారిస్తుంది. ప్రతిరోజూ వాక్కాయల రసం తీసుకోవటం వలన ఊపిరితిత్తులు, బ్రెస్ట్ కేన్సర్ రాకుండా నివారిస్తుంది.

వాక్కాయ దంతాలు పుచ్చిపోకుండా చేయడమే కాదు నోటి దుర్వాసన నుంచి కాపాడుతుంది. మెదడు సంబంధిత వ్యాధులు రాకుండా కాపాడటంలో ఇది అత్యంత ప్రయోజనకారి. వీటిని ఎక్కువగా తీసుకునే ముందు వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడం మంచిది.

– ఆనంద 'మైత్రేయ'మ్

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

**మధ్యప్రదేశ్‌లోని భోపాల్ పట్టణానికి ఈశాన్యంగా సుమారు ముప్పై మైళ్ల దూరంలో రైజన్ జిల్లాలోని మైదానంలోని చిన్న కొండపై సాంచి స్థూపాలు నిర్మించారు. మన దేశంలోని ఇతర స్థూపాల కంటే సాంచి స్థూపాలు చాలా శ్రేష్ఠమైనవి. మధ్యప్రదేశ్‌లో ఉన్న సాంచి స్థూపం భారతదేశంలో ఒక ముఖ్యమైన బౌద్ధ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం. దీని చరిత్ర, వాస్తుశిల్పం, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కారణంగా ఇది ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది.**

# చారిత్రక వారసత్వానికి చిహ్నం.. సాంచి

ఈ మహా స్థూపాన్ని క్రీ.పూ.3వ శతాబ్దంలో మౌర్య చక్రవర్తి అశోకుడు నిర్మించాడు. బౌద్ధమతం వ్యాప్తిలో దీని పాత్ర చాలా కీలకమైనది. సాంచిలోని బౌద్ధ కట్టడాలను యునెస్కో 1989లో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. ఈ స్థూపం దగ్గర అశోకుని స్తంభం కూడా ఉంది. దీనిపై ఉన్న నాలుగు సింహాల విగ్రహమే మన భారతదేశ జాతీయ చిహ్నానికి మూలం. బుద్ధుడు ఈ ప్రాంతాన్ని సందర్శించకపోయినప్పటికీ, సాంచి స్థూపం అశోకుడి కాలంలో బౌద్ధమతానికి ఒక ప్రధాన కేంద్రంగా ఉండేది. ఈ స్థూపం మన దేశం సాంస్కృతిక, చారిత్రక వారసత్వానికి ఒక ముఖ్యమైన చిహ్నం.

సాంచి స్థూపం అర్ధ గోళాకారంలో ఉంటుంది. ఇది బుద్ధుని జ్ఞానోదయాన్ని సూచిస్తుంది. దీనిపైన ఒక చతురస్రాకారపు రెయిలింగ్ (హర్మిక), మూడు గొడుగుల వంటి నిర్మాణం (ఛత్ర) ఉంటాయి. స్థూపానికి నాలుగు వైపులా నాలుగు అద్భుతంగా చెక్కిన తోరణాలు ఉన్నాయి. ఇవి బుద్ధుని జీవిత ఘట్టాలను, జాతక కథలను, బౌద్ధమతానికి సంబంధించిన ముఖ్య సంఘటనలను వివరిస్తాయి. ఈ శిల్పాలు భారతీయ కళా నైపుణ్యానికి నిదర్శనం.

క్రీ.పూ.2 నుంచి 11వ శతాబ్దం వరకు జరిగిన బౌద్ధ విషయాలు వీటి ద్వారా తెలుసుకోవచ్చు. సాంచి స్థూపం నిర్మించిన ప్రదేశం బుద్ధ జీవితపు ఏ సంఘటనతోనూ సంబంధమున్నది కాదు. ఇక్కడ ఎటువంటి బౌద్ధ మహాసభలు జరిగిన ఆధారాలు లేవు. చైనా యాత్రికులు ఫాహియాన్, హుయాన్‌త్సాంగ్‌లు తమ చరిత్రలో అనేక బౌద్ధ స్థూపాల గురించి రాశారు. కానీ సాంచిస్థూపం గురించి రాయలేదు.





అశోకచక్రవర్తి సాంచిని ఏలినట్టు చరిత్ర చెబుతోంది. అశోకుని భార్య అయిన శాక్యాకుమారి దేవి జన్మస్థలం విదిశా నగరం. విదిశా సాంచి సమీపంలో ఉన్నది. కళింగ యుద్ధానంతరం అశోకుని మనసు వికలమైంది. ఆయన బౌద్ధ మతం స్వీకరించి దాని ప్రచారానికి కంకణం కట్టుకుని అహింసా మార్గంలో పయనించారు. అశోకుని కుమారుడైన మహేంద్ర శ్రీలంకకు బౌద్ధమత ప్రచార నిమిత్తం సాంచి నుండే బయలుదేరి వెళ్ళారు.

సాంచి పూర్వపు పేరు కాకణాయ క్షేత్రం. ఒకప్పుడు ఇక్కడి బుద్ధ విగ్రహానికి పూజలు జరిపేవారు కాదు. మధుర నుండి సాంచికి బుద్ధ విగ్రహం తెప్పించి బుద్ధ పూజకు పునాది వేశారు. గుప్త సామ్రాజ్య పతనానంతరం 606 నుంచి 647 వరకు పాలించిన హర్షవర్ధనుని కాలంలో బౌద్ధ మతం మరలా చిగురు తొడిగింది. ఇతని కాలంలోనే అనేక బౌద్ధ సంఘారామాలు, మందిర చైత్యాలే కాక అనేక బౌద్ధ విగ్రహాలు తయారైనాయి. హర్షవర్ధనుడి మరణానంతరం రాజాశ్రయం కొరవడిన బౌద్ధ మతావలంబులు అనేక మంది సాంచి విడిచి వెళ్ళిపోయారు. అలా మరుగున పడిపోయిన సాంచిని 1818లో జనరల్ టేలర్ అనే పాశ్చాత్యుడు ప్రజల దృష్టిని ఆకర్షించేలా చేశాడు. ఆ తరువాత భోపాల్‌కు చెందిన కెప్టెన్ జాన్సీ ఈ సాంచి స్థూపాన్ని తల నుంచి కింది వరకు దురుసుగా తవ్వించిన కారణంగా కొన్ని పగుళ్ళు ఏర్పడ్డాయి. ఆ తరువాత 1851లో అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్ అనే ఆయన 2,3 స్థూపాల్లో మాత్రం పవిత్ర చిహ్నాల పేటికలను కనుగొన్నాడు.

ఇతనితో పాటు అతని మిత్రుడు కెప్టెన్ ఏ.సి. మోసి ప్రభృతులు చేసిన కొన్ని పనుల వల్ల కూడా కొంతమేర ఈ నిర్మాణాలకు హాని జరిగినట్లు తెలుస్తోంది. దీని తరువాత 1881 వరకు అనేక దోపిడీలకు గురవుతూ సాంచి స్థూపం అజ్ఞాతంగానే ఉంది.

అనంతరం మేజర్ కోల్ అనే సహృదయుడు సాంచి గొప్పదనాన్ని అర్థం చేసుకుని మూడేళ్ళ స్వల్ప కాలంలో ఈ స్మారకం చుట్టూ వున్న అడవిని నరికించి స్థూపపు పగుళ్లను పూడ్పించి అనేక మరమ్మత్తులు గావించాడు. సాంచీలో మొత్తం మూడు స్థూపాలున్నాయి. అన్నింటికంటే పెద్ద స్థూపం 120 అడుగుల వ్యాసం, 54 అడుగుల ఎత్తు కలిగి ఉంటుంది. దీని నిర్మాణం అశోకుడి కాలంలో జరిగినట్లు తెలుస్తోంది. దీన్ని మహాస్థూపం అంటారు. ఈ స్థూపం చుట్టూ ఒక గోడ నిర్మితమైంది. దాని చుట్టూ నాలుగు వైపులా తోరణద్వారాలు నిర్మించారు. అన్నింటి కంటే ముందుగా దక్షిణ తోరణ ద్వారాన్ని నిర్మించారు. ఇదే సాంచీ స్థూపానికి ప్రధాన ప్రవేశ ద్వారం.



పశ్చిమ తోరణ ద్వారపు మధ్య అడ్డకమ్మీ బలమిత్ర దానం చేసినట్లుగా, అలాగే తూర్పు తోరణ ద్వారపు దక్షిణ స్తంభమునూ, పశ్చిమతోరణపు ద్వారపు ఉత్తర స్తంభమునూ కువర్ నివాసి నాగప్రియ దానం చేసినట్లు రాసిఉన్నది. ఈ నాలుగు తోరణ ద్వారాల శిల్పాలను విదిశా నగరశిల్పులైన దంతకారులు తయారు చేశారు.

ప్రతి ద్వారానికీ నాలుగు పలకలు గల దృఢమైన రెండు స్తంభాలు, వాటి అగ్రభాగాన నాలుగు సింహాలు, నాలుగు ఏనుగులు, నలుగురు మరుగుజ్జులు, వీళ్ళల్లో ఎవరో ఒకరు కుండలాకారంగా ఉన్న మూడు అడ్డకమ్ములను మోస్తున్నట్లు చెక్కి ఉన్నాయి. ఈ అడ్డకమ్ముల మధ్యన చిన్న చిన్న స్తంభాలు వాటి మధ్యనున్న ఖాళీ ప్రదేశంలో ఏనుగుల మీదా, గుర్రాల మీదా స్వారీ చేస్తున్న మనుషులు చెక్కారు. పై అడ్డకమ్మి మధ్యలో తోరణం ద్వార మకుటాలుగా ధర్మచక్రం, త్రిరత్నాలు చెక్కి ఉండి ధర్మచక్రానికి ఇరువైపులా యక్షమూర్తులు నిలబడి ఉన్నారు. కింది అడ్డకమ్మి అడుగు భాగం అందరికీ కనబడేది కాబట్టి దానిని పూలతోనూ, లతలతోనూ నింపారు. తోరణాలపై బౌద్ధ జాతకకథలు, అశోకుడి జీవిత వృత్తాంతాల చిత్రీకరణ జరిగింది. ఒక ద్వారముపై ఇంటిని విడిచి వెళ్తున్న గౌతముడి చిత్తరువు, పశ్చిమ ద్వారంపై బుద్ధునికి చెందిన అవశేషాలు కనివస్తాయి. అనేక మంది శిల్పుల చేత రూపొందిన ఈ తోరణ ద్వారములు కొద్దిపాటి తేడాలు కలిగి ఉన్నా మొత్తం మీద అన్ని ఒకే లక్ష్యంతో, బౌద్ధ మత భక్తి భావనకు ప్రతీకగా తయారు చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే సాంచీలోని తోరణ ద్వారాలు బౌద్ధ శిల్పాన్ని ఐదు భాగాలుగా విభజించవచ్చు.

జాతక కథలు, గౌతమ బుద్ధుని జీవిత దృశ్యాలు, బౌద్ధ ధర్మపు ఉత్తరార్థంలో జరిగిన చారిత్రాత్మక సంఘటనలు, మనుషులతో గౌతమబుద్ధుని సంబంధాలు, వివిధ అలంకరణ దృశ్యాలు మొదలైనవి ఇక్కడి తోరణ ద్వారాలపై ముఖ్యాంశాలు. పడమటి ద్వారంలో బుద్ధుని ఏడు ముఖ్యమైన జీవిత ఘట్టాలు శిల్పీకరించారు. దక్షిణ ద్వారంలో బుద్ధ జననం, తూర్పు దిక్కున ఆయన రాజ్యాన్ని వదిలిపోవడం, ఉత్తరం వైపున బుద్ధుడు మామిడి చెట్టుకింద కూర్చుని బోధనలు చేస్తున్నట్లుగా శిల్పీకరించారు. తూర్పు ద్వారంపై గౌతముడి తండ్రి సదనాన్ని త్యాగం చేయడం, తల్లి స్వప్నం, మరికొన్ని అద్భుత శిల్పాలు శిల్పీకరించారు. దక్షిణ ద్వారానికి సమీపంలో గల అశోక స్తంభంపై భాగంలో నాలుగు వైపులా నాలుగు సింహపు తలలు చెక్కారు. ఈ శిల్పాన్ని భారత జాతీయ చిహ్నంగా మనం స్వీకరించాం, స్థూపానికి ఈశాన్యంలో సిరిపుట్ట, మహా మౌఘలన్ అనే బుద్ధుని ప్రముఖ శిష్యుల అస్థికలు భద్రపరచిన కట్టడం ఉంది. దక్షిణ ద్వారం దగ్గర ఎదురుగా ఉన్న చైత్య మందిరంలో బౌద్ధులు ప్రార్థనలు చేసేవారు. ఇలా ఒకదాన్ని మించిన మరో విశేషాలతో సాంచీ స్థూపం ప్రపంచ ప్రసిద్ధి చెందినది.

## ఉదయగిరి

సాంచికి 13 కి.మీ. దూరాన పడమర దిశగా నెలకొని ఉంది ఉదయగిరి. ఇక్కడి కొండను తొలిచి ఇరవై గుహలు నిర్మించారు. వీటిలో మొదటిది, చివరిది జైన మతానికి చెందిన గుహలు. మిగిలినవన్నీ హిందూ గుహలే. ఈ గుహలు గుప్తుల కాలానికి చెందినవి. క్రీ.శ.375-415 మధ్య కాలంలో పాలించిన రెండవ చంద్రగుప్తుడు. క్రీ.శ. 415-455 వరకు పాలించిన మొదటి కుమారగుప్త కాలంలో ఉదయగిరి గుహలు తొలగించారు.

గ్రేట్ బౌల్ (మహా పాత్ర) అనేది పెద్ద రాతితో చేసిన ఒక పాత్ర. భిక్షువులకు భిక్ష వేయడానికి దీనిని ఉపయోగించే వారని చెబుతారు. సాంచి ప్రాంతంలో ఇంకా కొన్ని పురాతన బౌద్ధ విహారాలు, గుప్త కాలానికి చెందిన దేవాలయాల శిథిలాలు కూడా ఉన్నాయి. ఇవి ఆ కాలం నాటి జీవనశైలి, వాస్తుశిల్పాన్ని ప్రతిబింబిస్తాయి.

1912-19 మధ్య కాలంలో సర్జాన్ మార్షల్ ఆధ్వర్యంలో పూర్వ ఆకారాలను కలిగేలా నిర్మాణాలను పునరుద్ధరించి, వాటి మొత్తాన్ని ఓ మ్యూజియంగా ఏర్పాటు చేశారు. మ్యూజియం తక్కువ స్థలం కారణంగా అసలు ప్రదేశం నుంచి కొత్త భవనంలోకి తరలించారు. ప్రస్తుత మ్యూజియంలో నాలుగు గ్యాలరీలతోపాటు ఓ పెద్ద హాలు ఉంది. శుక్రవారం మినహా ప్రతిరోజూ ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ మ్యూజియం సందర్శనకు అనుమతి ఉంటుంది.

**- షేక్ అబ్దుల్ హకీం జాని**

# 12 అక్టోబరు, 2025 నుండి 18 అక్టోబరు, 2025 వరకు



## వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం నూతన వ్యాపారానికి తగిన పెట్టుబడులను అందుకోగలుగుతారు. ఇరుగు పొరుగు వారితో మాట పట్టింపులు చిన్నచిన్న గొడవలు ఏర్పడతాయి. ఫుడ్ వ్యాపారస్తులకి క్యాటరింగ్ వ్యాపారస్తులకి అనుకూలంగా ఉంటుంది. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణీ త్రిశూల్ పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది.

### వృషభం

ఈ వారం ఇంట్లోనూ వ్యాపార ప్రదేశాల్లోనూ నిమిషం తీరిక లేకుండా గడుపుతారు. ప్రతి ఒక్క పని మీరే చేయవలసిన పరిస్థితులు ఏర్పడతాయి. కిందిస్థాయి ఉద్యోగస్తులతో సతమతమవుతారు. సమస్యలు ఏర్పడతాయి. ప్రత్యేకించి మహిళలతో మీకు అసంతృప్తి కలుగుతుంది. లక్ష్మీ తామర వత్తులతో అష్టమూలిక తైలంతో దీపారాధన చేయండి.

### మిథునం

ఈ వారం  ఒకానొక సందర్భంలో ముఖ్యమైన సమాచారం, వస్తువులు, ఆలస్యంగా మనకి చేరటం ద్వారా నష్టపోయే అవకాశం ఉన్నది. ఈ పరిస్థితి రాకుండా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ  ఫలితాలు ఏమి ఉండవు. ఆరోగ్య విషయాలలో జాగ్రత్త వహించండి. స్వల్పమైన అనారోగ్య సమస్యలు అజీర్తి ఏర్పడే అవకాశం ఉన్నది. చేతికి సర్పదోష నివారణ కంకణాన్ని ధరించండి.

### కర్కాటకం

ఈ వారం పలువురి మెప్పుని పొందుతారు. కొత్త బాధ్యతలను స్వీకరిస్తారు ప్రయోజనాలని అందుకుంటారు. బ్యాంకు రుణాల గురించి అధికంగా ఆలోచిస్తారు. స్వల్ప ప్రయోజనాల కోసం పెద్ద స్థాయి పరిచయాలను ఉపయోగిస్తారు మీ వారి కోసం కొన్ని చెయ్యక తప్పనటువంటి పరిస్థితులు ఏర్పడతాయి. శ్రీ లక్ష్మి చందనంతో సుబ్రమణ్య స్వామి వారికి అభిషేకం జరిపించండి.

### సింహం

ఈ వారం రుణాలు తీసుకుంటారు. చిన్న చిన్న వ్యాపారస్తులకు తాత్కాలిక వ్యాపారస్తులకు కాలం అనుకూలంగా ఉంటుంది. స్నేహాలు పరిచయాలు పెంచుకునే ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. కొన్ని అసోసియేషన్ లో మెంబర్షిప్ దరఖాస్తు చేసుకుంటారు. మెడలో శ్రీ మేధా దక్షిణామూర్తి డాలరు ధరించండి. వాలంటరీ రిటైర్మెంట్ గురించి ఎక్కువగా ఆలోచిస్తారు.

### కన్య

ఈ వారం పార్ట్ టైం జాబ్  పట్ల ఆకర్షితులవుతారు. కొన్ని ఖర్చుల నిమిత్తం పెట్టుబడుల నిమిత్తం ధనం కోసం ఎంతగానో శ్రమిస్తారు. ప్రజా పోరాటాలలో  ఉత్సాహంగా పాల్గొంటారు. సహోద్యోగులతో సహచర  బృందంతో సన్నిహితంగా మెలుగుతారు. నూతన వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టాలన్న ఆలోచన కలుగుతాయి. యజ్ఞభస్మంతో శివ అర్చన చేసి ఆ భస్మంని బొట్టుగా ధరించండి.

### తుల

ఈ వారం శుభకార్యాల నిమిత్తం మీ ఆలోచనలు మీ ప్రవర్తన పనితీరులో మార్పులు ఏర్పడతాయి. నూతన కళాశాలలో స్వల్పమైన సమస్యలను ఎదుర్కొంటారు. కొత్త స్నేహితులు పరిచయాలు మీకు అంతగా నచ్చకపోవచ్చు. యజ్ఞ భస్మంతో శివ అర్చన చేసి ఆ భస్మంని బొట్టుగా ధరించండి. షేర్ మార్కెట్ స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి. తాత్కాలికమైన ప్రచారాలు చూసి మోసపోవద్దు.

### వృశ్చికం

ఈ వారం ముక్కుసూటిగా ప్రవర్తించే వ్యక్తులతో స్నేహాలను కొనసాగిస్తారు. కొన్ని పనులలో మీరు ఆశించిన ప్రయోజనాలు రాకపోవచ్చు. పనులు నెమ్మదిగా సాగటం కొద్దిపాటి నష్టానికి కారణం అవుతుంది. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. ఒకానొక ఉద్యోగం కోసం ఎంతగానో ప్రయత్నిస్తారు. ఆఖరి నిమిషంలో చేయి జారుతుంది. బ్యాంకు  ఉద్యోగస్తులకు కాలం అనుకూలంగా ఉంటుంది.

### ధనస్సు

ఈ వారం ప్రతి ఒక్క విషయంలోనూ నిరాశకు గురి చేయడం, ఇబ్బందికరమైన మాటలు వినటం, పెద్ద సమస్యగా మారుతుంది. ఇలా మాట్లాడే వారికి దూరంగా ఉండాలని మీ ఆలోచనలు ఆచరణలో మాత్రం అంతంత మాత్రంగానే ఉంటాయి. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి నరదిష్టి తొలగిపోతుంది. ప్రేమల పట్ల ప్రేమ వివాహాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు.

### మకరం

ఈ వారం కళ సాహిత్యాల పట్ల ఆసక్తికి కలిగి ఉంటారు. సినిమాలు, ఎలక్ట్రానిక్ మీడియా పట్ల ఆకర్షణ ఉంటుంది. ఇంట్లో వారికి నచ్చకపోయినా కొన్ని కోర్సులు నేర్చుకోవాలి అని భావిస్తారు. రైతులకు స్వల్ప సమస్యలు ఏర్పడతాయి. ప్రకృతి కన్నెర్ర బాధ కలిగిస్తుంది. కొంతమంది వల్ల నిరాశ ఎదురవుతుంది ఆశించిన స్థాయిలో వారి అండదండలు లభించకపోవచ్చు. అష్టమూలిక తైలంతో లక్ష్మీ తామర వత్తులతో దీపారాధన చేయండి.


### కుంభం


ఈ వారం కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సహోద్యోగులతో భేదాభిప్రాయాలు చోటు చేసు కుంటాయి. మీ మానసిక స్థితిని అర్థం చేసుకోగలిగిన వారు నిజంగా ఎవరు అనేది ఈ వారం తెలుసుకోగలుగుతారు. నరదృష్టి అధికంగా ఉంటుంది. సుమంగళి పసుపుతో గౌరీ దేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. సంఘంలో కీర్తి పెంపొందుతుంది.


### మీనం

ఈ వారం వ్యక్తిగత విషయాలకు ప్రాముఖ్యతనివ్వకుండా వృత్తిపట్ల అంకితభావంతో శ్రద్ధ చూపిస్తారు. కొత్త కోర్సులని చదవాలని చేసే ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయి. లిఖితపూర్వకంగా రాసే పత్రాలు ప్రయోజనాలను అందజేస్తాయి. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. పోటీ పరీక్షల్లో విజయాన్ని సాధిస్తారు. గవర్నమెంట్ ఉద్యోగం కోసం, ప్రైవేటు ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి.

# ఈ వారం కార్టూన్స్


మా ఆయన.. బయట ఎక్కడెక్కడికి వెళ్తున్నాడు, ఎవరెవర్ని కలుస్తున్నాడు..? మొత్తం లైవ్ వీడియో కావాలి.. ఇవ్వగలరా?
NASA


కొత్తగా తలుపు కొడతారేంటి? పూల కుండీ కింద 'కీ' ఉంటుంది కదా?!


హై బీపీ ఉందని నన్ను గట్టిగా అరవొద్దన్నాడు కదా డాక్టర్.. ఇంకో కుక్కను తీసుకెళ్దామా..?!
Zakir...



అమెరికాలోని ఈ జలపాతాన్ని మల్ట్‌నోమా జలపాతం అని పిలుస్తారు. ఈ జలపాతాన్ని దగ్గర్నుంచి చూడటానికి వంతెన నిర్మించారు. అదీ దీని ప్రత్యేకత.





